కార్మికుల కష్టాలకు తెర

★ సెజ్‌లో ఈఎస్ఐ ఆసుపత్రికి 29న భూమిపూజ
★ కూటమి సర్కారు కృషితో వేగంగా అడుగులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: కార్మికులు వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్న అచ్యుతాపురంలోని ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి రంగం సిద్ధమైంది. బ్రాండిక్స్ ప్రధాన ద్వారానికి ఎదురుగా రెండు ఎకరాల విస్తీర్ణంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ఈ నెల 29న దీని నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారని ఈఎస్ఐ అధికారులు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయడానికి ఈఎస్ఐ అధికారులు గురువారం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఆధునిక సౌకర్యాలతో రూ.69 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారని ఈఎస్ఐ ఉన్నతాధికారి జోష్ మార్టిన్ తెలిపారు.


నిర్మాణ పనులపై చర్చిస్తున్న ఈఎస్ఐ ఉన్నతాధికారులు

అయిదేళ్లు పట్టించుకోని వైకాపా ప్రభుత్వం

ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మించాలని కార్మికులు వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో ఎంతగా కోరినా జగన్ పట్టించుకోలేదు. అచ్యుతాపురం సెజ్‌లో తరచూ ప్రమాదాలు జరిగి వైద్య సేవలు అత్యవసరమైనా కనీసం కేంద్రంతో చర్చించడానికి ముందుకురాలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో 17మంది మృతిచెందడం, మరికొంత మంది తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రి నిర్మాణంపై చంద్రబాబు ప్రభుత్వం వేగంగా అడుగులు వేసింది. కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణంపై చర్చించడంతో దీని నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఆసుపత్రి నిర్మాణంతో అచ్యుతాపురం సెజ్‌లోని 50వేలమంది వరకు కార్మికులకు వైద్యసేవలకు భరోసా కలిగే అవకాశం ఉంది. అచ్యుతాపురంతోపాటు పరవాడ ఫార్మాసిటీ, నక్కపల్లి, రాంబిల్లి మండలాల పరిధిలో మరో లక్ష మంది వరకు కార్మికులకు సకాలంలో వైద్యసేవలు అందే అవకాశం ఉంటుంది. ఆసుపత్రితోపాటు సిబ్బంది నివాస గృహాల సముదాయం ఇక్కడే నిర్మించనున్నారు. 30 పడకల సామర్థ్యాన్ని కనీసం 200 పడకలకు పెంచాలని కార్మిక సంఘం నాయకులు కోరుతున్నారు.

డీఈవోగా అప్పారావునాయుడు



అనకాపల్లి, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారిగా జి. అప్పారావునాయుడిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖ ఏడీగా ఉన్నారు. ఇంతవరకు అనకాపల్లి జిల్లా డీఈవోగా ఉన్న ఎం.వెంకటలక్ష్మమ్మను ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు.

నేటి నుంచి పశుగణన

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఈ నెల 25 నుంచి పశుగణన కార్యక్రమం ప్రారంభమవుతుందని పశువైద్య శాఖ సహాయ సంచాలకురాలు డాక్టరు బి. సౌజన్య తెలిపారు. అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, దీనికోసం మండలానికి 15 మంది సిబ్బందిని నియమించామన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలు, ఇతర జీవాల వివరాలు ప్రజలు ఈ నెల 28లోగా అందించాలని కోరారు. పథకాల రూపకల్పనకు, టీకాలు, మందుల పంపిణీకి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు.

కడసారి వీడ్కోలుకూ కష్టాలేనా?

శ్మశాన వాటిక మార్గం ధ్వంసంపై ఆందోళన


కల్వర్టుపై మృతదేహాన్ని తీసుకువెళ్తున్న కుటుంబ సభ్యులు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: సర్వసిద్ధిలో శ్మశాన వాటిక మార్గం ధ్వంసం చేశారంటూ కొందరు వ్యక్తులు ఆందోళన చేశారు. గ్రామానికి చెందిన చింతాడ చిన్న సన్యాసి నాయుడు గురువారం అనారోగ్యంతో మరణించారు. ఆయన మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్తుండగా ఇక్కడి కాలువ గట్టుపై ఉన్న విద్యుత్తు స్తంభాలను కొందరు వ్యక్తులు తొలగించారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అక్కడే ఉంచి ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. వారు వచ్చి ముందు అంత్యక్రియలు నిర్వహించాలని సూచించారు. దీనిపై విచారణ చేపడతామని చెప్పడంతో మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన విరమించి అంత్యక్రియలు నిర్వహించారు.

నిండా పూడిక.. నీటికి చోటేదిక!

తాండవ, రైవాడల్లో తగ్గిన నిల్వ సామర్థ్యం

వర్షపు నీటిని ఒడిసిపట్టి వ్యవసాయానికి వినియోగించుకునేందుకు వీలుగా నిర్మించిన జలాశయాల్లో ఏటా పూడికలు పెరిగిపోతున్నాయి. ఫలితంగా రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించలేకపోతున్నాయి. ఇటీవల కేంద్ర జలసంఘం పూడిక ముప్పున్న జలాశయాల జాబితాను ప్రకటించింది. అందులో అనకాపల్లి జిల్లాకు చెందిన తాండవ, రైవాడ రిజర్వాయర్లున్నాయి. వీటి నిర్మాణ సమయంలో ఉన్న నిల్వ సామర్థ్యానికి, ఇప్పటి పరిస్థితికి వ్యత్యాసం ఎక్కువగానే ఉంది.

ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, అనకాపల్లి

పూడికలు ఎంత మేర పేరుకుపోయింది సర్వేలు చేస్తున్నారు కానీ వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. పూడికల విషయమై నిర్లక్ష్యంగా ఉంటే భవిష్యత్తులో జలాశయాలు ఒట్టిపోయే ప్రమాదం ఉందని సాగునీటి రంగం నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో తాండవ, పెద్దేరు, కోనాం, రైవాడ, కల్యాణపులోవ జలాశయాలున్నాయి. ఈ ఐదింటి రిజర్వాయర్ల కింద 1.03 లక్షల ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. వర్షాభావ పరిస్థితులు, జలాశయాల నిర్వహణ లోపాల కారణంగా ఎప్పుడూ పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగు నీరందించలేకపోతున్నారు. ఈ రిజర్వాయర్ల క్యాచ్‌మెంట్ ఏరియా అంతా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమే. అక్కడ కురిసిన వర్షాలతో నీరంతా వాగులు, వంకల ద్వారా జలాశయాల్లోకి వచ్చి చేరుతుంది. ఏజెన్సీలో కొంతకాలంగా పోడు వ్యవసాయం ఎక్కువగా చేస్తున్నారు. కొండలు, గుట్టల్లో చెట్లను కొట్టి, మట్టిని తవ్వి సాగు చేస్తున్నారు. దీంతో వర్షాల సమయంలో ఆ ఎర్రమట్టి అంతా నీటితో పాటు వచ్చి రిజర్వాయర్లలోకి వస్తోంది. అలాగే జలాశయాల ఎగువన మైనింగ్ కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆ వ్యర్థాలన్నీ వర్షపు నీటిలో కొట్టుకొచ్చి రిజర్వాయర్లలోకి చేరుతున్నాయి. వీటి మూలంగా పూడికలు ఏటా పెరిగిపోతున్నాయి. కేంద్ర జల సంఘం తాండవ, రైవాడ జలాశయాల గురించి మాత్రమే నివేదించినా మిగతా రిజర్వాయర్ల పరిస్థితీ అలానే ఉంది.

వాస్తవ నీటినిల్వ సామర్థ్యం: 3.59 (టీఎంసీలు)
ప్రస్తుత సామర్థ్యం: 3.12 (టీఎంసీలు)

రైవాడను డ్రిప్ పథకంలో చేర్చినా..

అనంతగిరి కొండల్లో కురిసిన వర్షం నీరంతా రైవాడ జలాశయానికి వచ్చిచేరుతుంది. ఆయా కొండల్లో మట్టి, ఎగువన మైనింగ్ వ్యర్థాలన్నీ రిజర్వాయర్‌లోకి రావడంతో పూడికలు పెరిగి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. గత 41 ఏళ్లలో 0.47 టీఎంసీల నీటినిల్వ తగ్గడంతో ఆ మేరకు ఆయకట్టుకు సాగునీరందించలేకపోతున్నారు. ఈ జలాశయం కింద 15,344 ఎకరాలు సాగవుతున్నాయి. విశాఖ నగరానికి రోజూ 50 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.



నిర్వహణ లోపాలకు తోడు పూడికల ప్రభావం సాగునీటి సరఫరాపై పడుతోంది. ఈ జలాశయం ఆధునికీకరణకు డ్రిప్ పథకంలో చేర్చినా కార్యరూపంలోకి తీసుకురాలేకపోయారు.

తాండవలో ఏటా తగ్గుముఖం..

వాస్తవ నీటినిల్వ సామర్థ్యం: 4.96 (టీఎంసీలు)
ప్రస్తుత సామర్థ్యం : 4.49 (టీఎంసీలు)

తాండవ జలాశయం కింద అనకాపల్లి, కాకినాడ జిల్లాలో పరిధిలో 51,465 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. ఈ జలాశయానికి ఎగువ నుంచి వచ్చే ప్రవాహం (ఇన్‌ఫ్లో) గత పదేళ్లలో ఎప్పుడూ పూర్తిస్థాయిలో రాలేదు. అరకొర సాగునీటితోనే ఆయకట్టుకు నీరందిస్తున్నారు. గతేడాది వర్షాభావంతో సగం విస్తీర్ణానికి కూడా నీరందించలేక వారబందీ విధానం అమలు చేయాల్సి వచ్చింది. ఎగువ నుంచి వచ్చే నీరు తగ్గిపోవడంతో పాటు జలాశయంలో పూడికలు పెరగడంతో నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీంతో ఈ రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతున్న అరకొర నీరు కూడా నిలిచే అవకాశం లేక వృథాగా వదిలేయాల్సి వస్తోంది.



దీనికి తోడు గత సర్కారు జలాశయాల నిర్వహణను గాలికి వదిలేసింది. గేట్లకు రంధ్రాలు పడినా పూడ్చలేకపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాకనే ఈ గేట్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నారు.

నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తుకు ముప్పు

ప్రభుత్వాలు చెరువులు, కాలువల్లో పూడికలు తీయిస్తున్నాయి. జలాశయాల జోలికిపోవడం లేదు. వేసవిలో నీరు తక్కువగా ఉంటుంది. ప్రతి అయిదేళ్లకు ఒకసారి పూడికలు తీయించాలి. ఇందుకు ప్రత్యేకంగా యంత్రాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించి తీయించొచ్చు. పూడికలు తీయకుండా నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో జలాశయాల్లో సగం కూడా నీరు నిల్వ ఉండే అవకాశం ఉండదు.

– ఎస్.కోటేశ్వరరావు, నీటిపారుదల శాఖ విశ్రాంత ఇంజినీర్, అనకాపల్లి

సంక్రాంతిలోగా గుంతల్లేని రోడ్లు

ఉమ్మడి జిల్లాలో మరమ్మతులకు 20 కోట్లు కేటాయింపు


అల్లూరి జిల్లాలో కొత్త రహదారులకు రూ. 1800 కోట్లతో ప్రణాళిక

జడ్పీ సర్వసభ్య సమావేశంలో హోంమంత్రి అనిత


వేదికపై మంత్రి అనిత, జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, విశాఖ, అల్లూరి, అనకాపల్లి జిల్లా కలెక్టర్లు

ఈనాడు, విశాఖపట్నం, అనకాపల్లి: అల్లూరి జిల్లాలో దశలవారీగా డోలీ మోతల్లేకుండా చేయడానికి రూ.1800 కోట్లతో రహదారుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గురువారం జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన ఉమ్మడి జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. అనిత మాట్లాడుతూ సంక్రాంతిలోగా రూ. 20 కోట్లతో ఉమ్మడి జిల్లాలోని రోడ్లపై గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పల్లె పండగ పేరుతో 25 జిల్లాల్లో రోడ్ల పనులకు శంకుస్థాపనలు చేస్తుంటే అల్లూరి జిల్లాకు పైసా కూడా కేటాయించకపోవడం ఘోరమని అక్కడి జడ్పీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కలెక్టర్ దినేష్‌కుమార్, మంత్రి అనిత సమాధానమిస్తూ ఏజెన్సీలో 1350 పైగా గ్రామాలకు ఇప్పటికీ రహదారి సదుపాయం లేదని, వాటన్నింటికీ రోడ్లు వేయడానికి రూ.1800 కోట్ల వరకు అవుతుందన్నారు. ఈ మేరకు ఉపాధిహామీ నిధులతో పాటు ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి ఇక్కడ పరిస్థితిని వివరించి అదనపు నిధులు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. గంజాయి సాగు నివారణకు ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అందరి సూచనలు, సలహాలతో జిల్లా సమగ్రాభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

జల్‌జీవన్ పనుల్లో జాప్యమెందుకు?: గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులు అస్తవ్యస్తంగా వదిలేశారని, రోడ్లను తవ్వేసి వదిలేయడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయంటూ పలువురు సభ్యులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై మండిపడ్డారు. 'మీరు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ప్రభుత్వం మాటలు కాయాల్సి వస్తోంద'ని మంత్రి అనిత సైతం అసహనం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు నూకరాజు

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు నియోజకవర్గంలోని పలు శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రస్తావించి వాటిని త్వరితగతంగా పరిష్కరించాలని అధికారులను కోరారు.

చట్రాయిపల్లి గ్రామాన్ని తరలిస్తాం..: ఇటీవల వర్షాలతో గూడెంకొత్తవీధి మండలంలో పలు గ్రామాలు బాగా దెబ్బతిన్నాయని, అధికారులు అరకొర పరిహారంతో సరిపెట్టేశారని జడ్పీటీసీ సభ్యులు శివరత్నం, దీసరి గంగరాజు, బాలయ్యపడాల్ ఆరోపించారు. దీనికి స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ పోడు వ్యవసాయం వల్ల కొండలు కరిగిపోయి గ్రామాల మీదకు వస్తున్నాయని చెప్పారు. కొండచరియలు పడిన చట్రాయిపల్లి గ్రామాన్ని సప్పర్ల సమీపానికి తరలిస్తామని, 37 కుటుంబాలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని వివరించారు.


హాజరైన ప్రజాప్రతినిధులు

విశాఖ ఉక్కుపై మా వైఖరి స్పష్టం..: విశాఖ ఉక్కు కర్మాగారం విషయమై పార్లమెంటులో ప్రస్తావించాలని ఓ సభ్యుడు **ఎంపీ శ్రీభరత్‌**ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్టీల్ ప్లాంటు విషయంలో కేంద్రం నుంచి సానుకూల పరిణామాలు చోటుసుకున్నాయని గుర్తుచేశారు. ప్లాంటు అవసరాల దృష్ట్యా రెండు దఫాలుగా రూ.1700 కోట్లు విడుదలయ్యాయని వెల్లడించారు. దీన్నిబట్టే ఉక్కు కర్మాగారం విషయంలో తమ వైఖరి ఏంటో స్పష్టంగా తెలుస్తోందన్నారు.



నరేగాను వ్యవసాయానికి అనుసంధానం చేయాలి..

'ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయించాలి. కాఫీ తోటల పెంపకానికి నరేగా ద్వారా సహకారం అందేలా చూడాలని, ఈ మేరకు పార్లమెంటులో ఈ సమస్య గురించి ప్రస్తావించాల'ని ఎంపీలు తనుజారాణి, శ్రీభరత్‌లను ఛైర్‌పర్సన్‌తో పాటు పలువురు జడ్పీటీసీ సభ్యులు కోరారు. ఏజెన్సీలో సరఫరా చేసిన రాజ్‌మా విత్తనాల్లో చాలావరకు నాసిరకంగా ఉంటున్నాయని, నాణ్యత లేని విత్తనాలను ఎందుకు ఇస్తున్నారని జడ్పీ ఛైర్‌పర్సన్ వ్యవసాయాధికారులను ప్రశ్నించారు. బడుల్లో ఉపాధ్యాయుల కొరత గురించి భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పుడు ప్రశ్నించారు. పాఠశాలల్లో పిల్లలతో పనులు చేయిస్తున్నారని, మధ్యాహ్న భోజన పథకం సరకులు దారిమళ్లుతున్నాయని మునగపాక జడ్పీటీసీ సభ్యుడు సోమసత్యనారాయణ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో అనకాపల్లి, విశాఖ కలెక్టర్లు విజయకృష్ణన్, హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, జడ్పీ సీఈవో నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో జేసీ జాహ్నవి, అధికారులు

నేరుగా పంటల బీమా నమోదుకు అవకాశం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: రైతులు పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ కోరారు. కలెక్టరేట్‌లో గురువారం సంయుక్త కలెక్టర్ జాహ్నవి, జిల్లా వ్యవసాయ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పంటల బీమాకు సంబంధించి ఇతరుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా జాతీయ పంటల బీమా పోర్టల్ ద్వారా ప్రీమియం కట్టుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రతి రైతు, కౌలు రైతుకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారన్నారు. రబీకి సంబంధించి జీడి పంటకు నవంబరు 15, ఇతర పంటలకు డిసెంబరు 15 నాటికి ఆఖరు తేదీగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గడువులోగా ప్రీమియం చెల్లిస్తే, పంట నష్టం జరిగినపుడు పరిహారం పొందొచ్చన్నారు. అనంతరం జిల్లాకు సంబంధించిన సమాచారాన్ని జేసీ వివరించారు.

తైక్వాండో పోటీలో అనకాపల్లి విద్యార్థిని ప్రతిభ



అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అఖిల భారత అంతర విశ్వవిద్యాలయ తైక్వాండో పోటీలకు దాడి ఇంజినీరింగ్ కళాశాల (డైట్) విద్యార్థిని **జయశ్రీ** ఎంపికైనట్లు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. సీఈసీ రెండో ఏడాది చదువుతున్న ఈ విద్యార్థిని ఇటీవల జేఎన్‌టీయూ అంతర కళాశాలల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపింది. నవంబరు 13, 14 తేదీల్లో జరిగే అఖిల భారత పోటీల్లో పాల్గొననున్నట్లు పీడీ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపల్ వైకుంఠరావు, అధ్యాపకులు అభినందించారు.

ఈ భోజనం తినలేం

ఆగ్రహంతో రోడ్డెక్కిన వసతి గృహ విద్యార్థినులు

రహదారిపై వంటావార్పుతో నిరసన


పాత జాతీయ రహదారిపై బైఠాయించి విద్యార్థినుల ఆందోళన

ఎలమంచిలి, న్యూస్‌టుడే: వసతిగృహంలో పెడుతున్న భోజనం బాగోలేదంటూ... వంటపనివారిని తక్షణం మార్చాలని డిమాండ్ చేస్తూ ఎలమంచిలి పట్టణంలోని ప్రభుత్వ బీసీ కళాశాల వసతిగృహం విద్యార్థినులు గురువారం ఆందోళనకు దిగారు. భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పాతజాతీయ రహదారిపై గంటసేపు బైఠాయించారు. రోడ్డుపై వంట చేస్తూ వాహనాల రాకపోకలు నిలిపివేశారు. పట్టణంలో కళాశాల బాలికల వసతిగృహాన్ని ఓ ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ వందమందికి పైగా విద్యార్థినులు ఉంటున్నారు. ఇక్కడ వంటకు ఇద్దరు, కాపలాదారుగా మరో మహిళ ఉంటున్నారు. వంటపనివారు భోజనం సరిగా వండటం లేదని, కాపలాదారు అసభ్యకరంగా మాట్లాడుతున్నారంటూ విద్యార్థినులు ఉదయం స్థానిక సహాయ సాంఘిక సంక్షేమాధికారికి (ఏఎస్‌డబ్ల్యూఓ) ఫిర్యాదు చేశారు. ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. వంటవారిని తక్షణం విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వసతిగృహానికి చేరుకుని అక్కడున్న వంట సామగ్రిని మోసుకుంటూ సమీపంలో ఉన్న పాత జాతీయ రహదారిపైకి చేరుకున్నారు. రోడ్డుపై వంట చేస్తూ ఆందోళన కొనసాగించారు. విద్యార్థినులంతా మానవహారంగా ఏర్పడి ఒక్క వాహనం కూడా వెళ్లకుండా అడ్డుకున్నారు. జిల్లా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఎస్ఎఫ్ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలిసిన స్థానిక సీఐ ధనుంజయరావు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులతో మాట్లాడి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తానని సీఐ హామీ ఇచ్చారు. విద్యార్థినుల ఆందోళన గురించి తెలిసిన కలెక్టర్ ఎలమంచిలి తహసీల్దార్ వరహాలును ఇక్కడికి పంపించారు. ఆయన అధికారులతో మాట్లాడారు. ఇక్కడ పనిచేస్తున్న వర్కర్లను మార్చడానికి ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో విద్యార్థులు శాంతించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ, డివిజన్ కార్యదర్శి మణికంఠ, భవాని, రేణు, రవి, అభి, రాము, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్దిచెబుతున్న సీఐ ధనుంజయరావు

గతుకుల రహదారులకు మరమ్మతులు

రూ.64 లక్షల మంజూరు.. పనులు ప్రారంభం


అప్పలరాజుపురం-కోనాం రోడ్డులో గతుకులకు మరమ్మతులు

చీడికాడ, న్యూస్‌టుడే: గతుకుల రహదారులపై రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి. వైకాపా ప్రభుత్వం రహదారుల మరమ్మతుకు నిధులు ఇవ్వకపోవడంతో ఐదేళ్లలో దారులన్నీ అధ్వానంగా తయారయ్యాయి. ప్రత్యక్ష నరకం చూసిన ఓటర్లు ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రహదారుల మరమ్మతుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చీడికాడ మండలంలో పలు రహదారులు గోతులు పడి అధ్వానంగా తయారయ్యాయని పలుమార్లు 'ఈనాడు'లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చొరవతో మండలంలోని మూడు ప్రధాన రహదారుల మరమ్మతుకు ప్రభుత్వం రూ.64 లక్షలు మంజూరు చేసిందని ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావు చెప్పారు. అప్పలరాజుపురం - కోనాం రహదారికి రూ.28 లక్షలు కేటాయించగా ఈ పనులు ఇటీవలే మొదలయ్యాయి. పెదగోగాడ రోడ్డు నుంచి తురువోలు, చీడిపల్లి, వాకపల్లి మీదుగా తెనుగుపూడి రోడ్డు వరకు మరమ్మతుకు రూ.18 లక్షలు మంజూరయ్యాయి. చీడికాడ నుంచి తురువోలు వరకు రూ.18 లక్షలతో మరమ్మతు చేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.


ఎల్.బి.పట్నంలో పూర్తయిన తారురోడ్డు పనులు

రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలకు ఎలమంచిలి విద్యార్థిని

ఎలమంచిలి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఎలమంచిలికి చెందిన విద్యార్థిని జి.హవిలా ఎంపికైంది. పట్టణంలోని సెయింట్ మేరిస్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని ఈనెల 25 నుంచి అన్నమయ్య జిల్లాలో జరిగే అండర్-14 పోటీల్లో ఆడుతుందని పాఠశాల కరస్పాండెంట్ కృప చెప్పారు. పాఠశాల ప్రిన్సిపల్ జోల్సానా, వ్యాయామోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు జి.కిరణ్‌కుమార్ అభినందించారు.


హవిలాతో పాఠశాల నిర్వాహకులు


మొక్కజొన్న పంటపై పిచికారీ

డ్రోన్‌తో జీవరసాయనాల పిచికారీ

ఖర్చు తక్కువ ఫలితం ఎక్కువ

డ్రోన్‌తో జీవ రసాయనాలు పిచికారీ చేస్తే లాభదాయకమని పరిశోధనల్లో తేలింది. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రెండేళ్ల క్రితం వీటిపై పరిశోధనలు చేపట్టారు. ఇప్పటికే డ్రోన్‌తో క్రిమిసంహారక మందులు దేశంలోని పలు ప్రాంతాల్లో పిచికారీ చేస్తున్నారు. మితిమీరిన క్రిమిసంహారక మందుల వినియోగం వల్ల వాతావరణ కాలుష్యంతోపాటు వాటిలోని అవశేషాలు పంట ఉత్పత్తులపై ఉండి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

అనకాపల్లి, న్యూస్‌టుడే:

ఒకే క్రిమిసంహారక మందు తరచూ పిచికారీ చేయడం వల్ల పురుగులు నిరోధక శక్తిని పెంచుకుంటున్నట్లు వ్యవశాయ శాస్త్రవేత్తలు గుర్తించారు. అందుకే క్రిమి సంహారక మందులకు బదులుగా కీటకనాశక జీవ శిలీంద్రాలను పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వీటిని అనకాపల్లి పరిశోధన కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్నారు. వరి, మొక్కజొన్న, చెరకు, కంది, పెసర, మినుము, కొబ్బరి పంటలకు జీవ రసాయనాలను ఇక్కడ రూపొందించారు. వీటి వినియోగానికి రైతులు స్ప్రేయర్లు ఉపయోగిస్తున్నారు. కానీ ఈ విధానంలో మందు వినియోగం పూర్తిస్థాయిలో పంటకు చేరకపోగా సమయం, ఖర్చు ఎక్కువ అవుతోంది. ప్రస్తుతం అభివృద్ధి చెందిన దేశాల్లో డ్రోన్ల సహాయంతోనే పురుగు మందు పిచికారీ చేస్తున్నారు. అందుకే కీటక నాశక జీవశిలీంద్రాలను డ్రోన్‌తో పిచికారీ చేసే విధానంపై ఇక్కడ పరిశోధనలు చేశారు. ఇటువంటి పరిశోధనలు చేయడం దేశంలో ఇదే ప్రథమమని అనకాపల్లి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు పి.వి.కె.జగన్నాథరావు తెలిపారు.


పిచికారీకి ఉపయోగిస్తున్న డ్రోన్

చెరకు, వరి పంటపై...

ప్రస్తుతం వరి, చెరకు పంటలలో డ్రోన్ వినియోగంపై పరిశోధనలు సాగుతున్నాయి. వరి పంటకు సోకే కాండం తొలుచు పురుగు, ఆకు ముడత దోమలను, చెరకు పంటకు వచ్చే వేరు పురుగులను జీవ రసాయనాలు ఉపయోగించి నివారించవచ్చు. వరి, చెరకు పంటలపై ఈ ఏడాది నుంచి పరిశోధనలు చేపట్టారు. మరో రెండు, మూడేళ్లు పరిశోధనలు చేయాల్సి ఉందని జగన్నాథరావు తెలిపారు. క్రిమిసంహారక మందులు, జింకు, పొటాషియం వంటి వాటిలో డ్రోన్ ఉపయోగించడంపై పరిశోధనలు చేస్తున్నారు.

మొక్కజొన్నకు మేలు

మొక్కజొన్నలో కత్తెర పురుగు ప్రధాన సమస్యగా ఉంది. దీని నివారణకు బ్యాక్టీరియా ఆధారిత జీవ శిలీంద్రమైన బాసిల్లస్ తురింజెన్సిస్ (బిట) లేదా కీటక నాశక జీవశిలీంద్రమైన మోటారైజియం అనిసోప్లియాలను ఇక్కడే ఉత్పత్తి చేస్తారు. వీటిని డ్రోన్‌తో ఏవిధంగా ఉపయోగించాలనే అంశంపై పరిశోధనలు చేశారు. సాధారణ స్ప్రేయర్ ద్వారా కత్తెర పురుగులను 83 శాతం నివారించగలిగితే డ్రోన్ ఉపయోగించడం వల్ల 87.7 శాతం అరికట్టగలిగారు.
● స్ప్రేయర్ ద్వారా చేస్తే మందు ద్రావణం చేసేందుకు ఎక్కువ నీరు అవసరం. కూలీల ఖర్చు ఎక్కువే. డ్రోన్‌తో ఎంత ఎత్తు నుంచి పిచికారీ చేయడం వీలవుతుందనే అంశంపై పరిశోధనలు చేశారు. చివరకు 1.1 మీటర్ల ఎత్తు నుంచి చేస్తే బాగుందని గుర్తించారు. సెకనుకు నాలుగు మీటర్ల వేగంతో డ్రోన్‌ను నడపాల్సి ఉంటుంది. స్ప్రేయర్ ద్వారా ఎకరా విస్తీర్ణంలో ద్రావణం పిచికారీ చేయడానికి నాలుగు గంటల సమయం పడుతుంది. డ్రోన్‌తో కేవలం 10 నిమిషాల్లో చేయవచ్చు. ఎకరాకు కేజీ మందు ఉపయోగించాలి. స్ప్రేయర్‌తో చేస్తే 200 లీటర్లు నీరు ఉపయోగించాలి. డ్రోన్‌తో చేస్తే కేవలం 10 లీటర్ల నీరు సరిపోతుంది. డ్రోన్‌తో చేయడం వలన పంట అంతా సమానంగా పడుతుంది. నేరుగా పురుగుకు చేరుతుంది. జీవ రసాయనాలు డ్రోన్‌తో పిచికారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.


వరి పంటపై జీవ రసాయనాల పిచికారీ

వేములపూడి సామిల్లుపై విచారణకు ఆదేశం


కలపను పరిశీలిస్తున్న బీట్ అధికారి రాజబాబు

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: వేములపూడిలోని శ్రీనివాసా సామిల్లులో టేకు కలపకు సంబంధించి విచారణ నిర్వహించాలని అటవీ శాఖ విజిలెన్స్ డీఎఫ్‌వో ధర్మరక్షిత్ ఆదేశించారు. స్థానికంగా గురువారం ఓ ఫిర్యాదుదారును విచారిస్తుండగా.. అక్కడే ఉన్న బీటు అధికారి కె.రాజబాబుకు సామిల్లులో టేకు కలప కోత జరుగుతోందని, దీనిపై అనుమానాలు ఉన్నాయంటూ ఓ వ్యక్తి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ డీఎఫ్‌వో అనుమతి తీసుకుని హుటాహుటిన మిల్లు వద్దకు చేరుకున్న బీటు అధికారి టేకు కలపకు సంబంధించిన రికార్డులు చూపాలని నిర్వాహకులను ప్రశ్నించారు. గతంలో స్క్వాడ్ సిబ్బంది కేసు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేసిన కలపనే ఇప్పుడు కోస్తున్నామని అక్కడి సిబ్బంది పత్రాలను చూపారు. ఈ విషయాన్ని డీఎఫ్‌వోకి నివేదించారు. విచారణ చేపట్టి లోపాలు గమనిస్తే కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో మిల్లు నడిచేందుకు వినియోగించే గుటకాలను స్వాధీనం చేసుకుని విద్యుత్తు రీడింగ్‌ను నమోదు చేసినట్లు బీటు అధికారి రాజబాబు చెప్పారు.

డోలీ మోతలు నివారించాలని ధర్నా

విశాఖపట్నం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో డోలీ మోతలు నివారించాలని పలువురు గిరిజనులు గురువారం జడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పీవీటీజీ గిరిజన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి, విద్యుత్తు సదుపాయం కల్పించాలన్నారు. కొయ్యూరు మండల పరిధి మూలపేట, రోలుగుంట మండల పరిధి పొత్వగెడ్డ, నీలుబంద, కవ్వకుంట మీదుగా రహదారి ఏర్పాటుకు ఉపాధి నిధులు రూ.కోటి విడుదల చేశారని, పనులు మాత్రం పూర్తి కాలేదని వాపోయారు. అనంతగిరి మండల పరిధిలోనూ ఇటువంటి పరిస్థితులే ఉన్నాయని వాపోయారు. జడ్పీ సాధారణ సమావేశంలో తమ సమస్యలపై చర్చించి పరిష్కారం కనుగొనాలని కోరారు. సంఘం నాయకులు కె.వెంకటరావు, చిన్నారావు, కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గిరిజనులు మంత్రి అనితను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.


జడ్పీ కార్యాలయం సమీపంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు


నిరసనకారులతో మాట్లాడుతున్న హోంమంత్రి వంగలపూడి అనిత

విద్యార్థినిపై వార్డెన్ లైంగిక వేధింపులు

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రైవేట్ వసతిగృహంలో ఉంటున్న బాలికను సంక్షేమాధికారి లైంగికంగా వేధించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. లైనుకొత్తూరు గ్రామం వద్ద రామకృష్ణాపురం కాలనీలో ప్రైవేటు వసతిగృహం ఉంది. వార్డెన్‌గా పని చేస్తున్న రావాడ శ్రీను ఈ వసతిగృహంలో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై పదిరోజుల కిందట లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు బాలికతోపాటు ఆమె చెల్లెలిని తీసుకువెళ్లిపోయారు. పోలీసులు వార్డెన్‌పై కేసు నమోదు చేసినా గోప్యంగా ఉంచారు. ఈ విషయంపై గ్రామీణ ఎస్సై ఉపేంద్రను వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి ఏఎంఏఏ ఆంగ్ల మాధ్యమ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శనతో రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.మణికుమారి తెలిపారు. పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు సమ్మింగ భవ్య (బాల్ బాడ్మింటన్), బి.శివ (కబడ్డీ), బి.భాస్కర్, పి.నరేంద్ర, ఎస్.హిరణ్యను (ఖోఖో) కరస్పాండెంట్ కొణతాల శివ కుమార్, అధ్యక్షుడు కె.నారాయణరావు, వర్తక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కొణతాల లక్ష్మీనారాయణరావు, తమ్మన రఘుబాబు, ప్రధానోపాధ్యాయురాలు కోరిబిల్లి లావణ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు పొలిమేర శివ అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రతినిధులు

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగికి చెందిన నక్కా రామకృష్ణ బుధవారం రాత్రి నక్కపల్లి వైపు నుంచి తుని వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. నామవరం వద్ద వెనుక నుంచి వచ్చిన ఆయనను లారీ వేగంగా వచ్చి ఢీకొంది. నడుముకు బలమైన గాయం కావడంతో రామకృష్ణ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పురుషోత్తం చెప్పారు.

నేడు కిరండూల్ రైలుకు అదనపు విస్టాడోమ్ బోగీ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని విశాఖ-కిరండూల్-విశాఖ(08551-08552) రైళ్లకు అదనపు విస్టాడోమ్ బోగీని జత చేయనున్నట్లు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 25న విశాఖ-కిరండూల్ రైలుకు, 26న కిరండూల్-విశాఖ రైలుకు ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇప్పటికే ఆయా రైళ్లు రెండు విస్టాడోమ్ బోగీలతో రాకపోకలు సాగిస్తున్నాయని పేర్కొన్నారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక సిబ్బంది

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో గంజాయి రవాణా మార్గాలు, మూలాలను పరిశీలించి, దీనికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం ఎన్‌డీపీసీఎల్ సెల్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గంజాయి రవాణాపై గట్టి నిఘా పెట్టామని పేర్కొన్నారు. చెక్‌పోస్టులను బలోపేతం చేస్తామని, కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కేసుల ప్రధాన పాత్రధారులను సాంకేతిక సాయంతో అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడ్డ వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, ప్రజలకు వివరించేలా ప్రచార కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. అదనపు ఎస్పీలు ఎం. దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు పాల్గొన్నారు.


ఎన్‌డీపీసీఎల్ సెల్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

వృద్ధుడిపై పెట్రోల్ పోసి హత్యాయత్నం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: వివాహేతర సంబంధంలో విభేదాల కారణంగా ఓ మహిళ వృద్ధుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన గురువారం సీతంపేటలో కలకలం రేపింది. ద్వారకా పోలీస్‌స్టేషన్ సీఐ రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... సీతంపేటకు చెందిన సురేంద్రగుప్తా (72), ఓ మహిళ (54) మధ్య కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. ఇటీవల ఆమెకు కేన్సర్ సోకడంతో గుప్తా పట్టించుకోవడం మానేశారు. దీంతో గురువారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. కోపంతో ఆమె గుప్తాపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రుడ్ని ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ డెయిరీకి నోటీసులు జారీ

గ్రామీణ భీమిలి, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ యాజమాన్యానికి భీమునిపట్నం ఆర్డీవో సంగీత్ మాథుర్ నోటీసులు జారీ చేశారు. నగరంలోని ఆరిలోవ ప్రాంతంలో సుమారు 7.95 ఎకరాల ప్రభుత్వ భూమిని డెయిరీ యాజమాన్యం ఆక్రమించినట్లు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆ భూమికి సంబంధించిన పత్రాలతో శుక్రవారం ఉదయం 11 గంటలకు భీమిలి ఆర్డీవో కార్యాలయంలో హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు. ఇవే ప్రతులను ఏపీఐఐసీ జోనల్ మేనేజరుకు, పశు సంవర్ధకశాఖ విశాఖ జిల్లా సంయుక్త సంచాలకులకు, విశాఖ గ్రామీణ మండల తహసీల్దారుకు కూడా పంపారు.

చిరు వ్యాపారాలతో మహిళల ఆర్థికాభివృద్ధి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: చిరు వ్యాపారాల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎలమంచిలి మున్సిపల్ కమిషనర్ బాకూరి ప్రసాదరాజు కోరారు. పట్టణంలోని కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో గురువారం మెప్మా అర్బన్ మార్కెట్‌ను డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మహిళలు వ్యాపారాలు చేసుకోవడానికి డ్వాక్రా సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు మగవారితో సమానంగా ఉద్యోగాల్లో పోటీ పడాలన్నారు. ప్రతి గురువారం ఈ బజార్‌లో సరకులు విక్రయించాలన్నారు. వ్యాపారంలో మెలకువలు నేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు పద్మావతి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ఎలమంచిలిలోని మెప్మా బజార్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	107
లైవ్	137	127
డ్రెస్డ్	199	224
స్కిన్‌లెస్	226	234

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట



అడ్డురోడ్డులో విద్యార్థుల ఆందోళన

ఉపకార వేతనాలు అందక ఇక్కట్లు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో కళాశాలలు ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీ, మండల కార్యదర్శి మణికంఠ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే విడుదల చేయాలని డిమాండు చేస్తూ విద్యార్థులతో కలిసి అడ్డరోడ్డులో రహదారిపై ఆందోళన చేపట్టారు. సూరి, తరుణ్, రామచంద్ర, రాజు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: బాబా అణు పరిశోధన కేంద్రం (బార్క్) నిర్వాసితులకు ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని నిర్వాసితులు కోరారు. ఆర్డీఓ షేక్ ఆయిషా గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బార్క్ రోడ్డు కోసం భూములిచ్చినా పొలాల్లోకి వెళ్లకుండా కంచె వేశారన్నారు. దీనిని తొలగించాలన్నారు. తహసీల్దార్ జనార్దన్, ఉప తహసీల్దార్ శ్యామ్, ఆర్ఐ కుమార్, పల్లి శేషగిరిరావు పాల్గొన్నారు.

అర్హుల జాబితా తయారీకి సర్వే

నక్కపల్లి: పరిశ్రమల నిమిత్తం భూములిచ్చినవారిలో ఆర్.ఆర్. ప్యాకేజీకి అర్హుల వివరాలను రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులు సేకరిస్తున్నారు. పలువురు ఉద్యోగులు గురువారం మూలపర, పాటిమీద, తమ్మయ్యపేట, చందనాడ గ్రామాల్లో పర్యటించారు.

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: దేవర రామచంద్ర: పొట్టేల్ శ్రీ సత్య: ఎంత పనిచేశావ్ చంటి
సత్యనారాయణ: స్క్రీన్-1: విశ్వం, స్క్రీన్-2: వెనమ్ ద లాస్ట్ డాన్స్ (3డీ) పరిస్సాయి,
షిరిడిసాయి: వేట్టయన్ ద హంటర్
వెంకటేశ్వర: నరుడి బ్రతుకు నటన
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: వెనమ్ ద లాస్ట్ డాన్స్ స్క్రీన్-2: మార్టిన్

అ వీ ఇ వీ

బొజ్జన్న కొండపై తుప్పలతో ఇక్కట్లు

అనకాపల్లి గ్రామీణం: పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండపై తుప్పలు తొలగించాలని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం ఆయన కొండను సందర్శించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు.

విద్యార్థులకు అభ్యసన సామగ్రి పంపిణీ

ఎస్.రాయవరం: వేమగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు జాతీయ ఉపకార వేతన పరీక్షకు సంబంధించి అభ్యసన సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆనంద్, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, సత్యనారాయణ, పాల్గొన్నారు.

కశింకోట: విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అభ్యసన సమయాలను అలవాటుగా మార్చాలని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచించారు. వెదురుపర్తి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఉదయం విద్యార్థి మేలుకో కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి విద్యార్థుల ప్రగతి పత్రాలు అందజేశారు.

రాజుపేట వీఆర్పీ విధులకు రాజీనామా

కోటవురట్ల: రాజుపేటలో గ్రామ క్షేత్ర సహాయకురాలిగా పనిచేస్తున్న వేగి సరోజనీ గురువారం ఎంపీడీఓ కాశీ విశ్వనాథరావుకు రాజీనామా పత్రాన్ని అందించారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు ఆమె వివరించారు.

హామీ అమలుకు పోస్టుకార్డు ఉద్యమం

అనకాపల్లి పట్టణం: ఎన్నికలో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలని కోరుతూ గురువారం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు.

ఘనంగా మరిడిమాంబ అమ్మవారి జాతర

కొత్తూరు (అనకాపల్లి): కొత్తూరు, పిసినికాడ గ్రామాల్లో మరిడిమాంబ జాతరలు గురువారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. తెదేపా నాయకులు పీలా గోవింద సత్యనారాయణ, దాడి రత్నాకర్, మళ్ల సురేంద్ర, జనసేన నాయకుడు భీమరశెట్టి రాంకీ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రతిభా పాటవ పోటీలు 28 నుంచి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: బాలల దినోత్సవం సందర్భంగా పీఆర్టీయూ ఆధ్వర్యంలో నర్సీపట్నంలో ఈనెల 28 నుంచి జిల్లాస్థాయి బాలల ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల గోడపత్రికను ఎంపీడీఓ సత్యనారాయణ గురువారం ఆవిష్కరించారు.

ఉల్లాస్‌పై ప్రత్యేక దృష్టి

నక్కపల్లి, న్యూస్‌టుడే: మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ డి.సీతారామరాజు సూచించారు. దీనిపై నక్కపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. నిరక్షరాస్యులకు స్వచ్ఛందంగా చదువు నేర్పే వాలంటీర్ల గుర్తింపు ప్రక్రియ జరిగిందన్నారు.

దేవుడా.. ఏమిటీ దుస్థితి?

కాలుష్య కాసారాలుగా ఉపమాక చెరువులు

ఉపమాక పేరు చెబితే అందరికీ గుర్తుకు వచ్చేది గరుడాద్రిపై కొలువైన కలియుగదైవమే. స్వామి దర్శనానికి తరలివచ్చే భక్తులు ఇక్కడే ఉన్న ఆలయ పుష్కరిణి బంధుర సరస్సులో కాళ్లు కడుక్కోవడం, పుణ్యస్నానం ఆచరించి వెళ్లడం చేస్తుంటారు. ఇదంతా ఒకప్పటి మాట. చెరువులకు నిర్వహణ లేక కాలుష్య కాసారాలుగా మారిన వీటిలో దిగేందుకు ప్రస్తుతం భక్తులు భయపడుతున్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే

ఉపమాక ఆలయం ఉత్తరాంధ్ర భక్తుల కొంగు బంగారంగా భాసిల్లుతోంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో తితిదేలో విలీనం చేయగా, అభివృద్ధి వైపు అడుగులు పడ్డాయి. స్వామివారికి నిత్య అభిషేకాలు, ఇతర కార్యక్రమాల కోసం ఆలయాన్ని ఆనుకుని ఉన్న బంధుర సరస్సులో నీటిని వినియోగించడంతో పాటు, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేవారు. ఈ సరస్సు పక్కనే మరో పెద్ద చెరువు ఉంది. ఇందులో సాధారణ స్నానాలతోపాటు నిమజ్జనాలు చేస్తుంటారు. వైకాపా పాలనలో ఆలయ ఆలనా, పాలన సరిగా పట్టించుకోలేదు. నిర్వహణపై శీతకన్ను వేయడం, చేపలను తూతూమంత్రంగా చేయడం మొదలుపెట్టారు. దీనికితోడు చెరువు నిర్వహణ గాలికొదిలేశారు. కాగా రెండేళ్ల కిందట చెరువు చుట్టూ రాతి పేర్పుతో పాటు, గ్రిల్స్ వేసి దీని రూపురేఖలు కాస్త మార్చారు. ఇదే సమయంలో చెరువులోకి నీరు వచ్చే మార్గాన్ని మూసేశారు. ఫలితంగా ఇందులో చెత్తాచెదారాలు పేరుకుపోయి మురుగులా మారింది. ఇక్కడ పరిస్థితిపై 'ఈనాడు'లో పలు కథనాలు వచ్చాయి. పరిస్థితిని గుర్తించి తితిదే అధికారులు ఎట్టకేలకు ఇందులో చెత్తాచెదారాలు తీయించారు. ఇప్పటికైనా దీన్ని వదిలేశారు తప్పితే శాశ్వత చర్యలు చేపట్టలేదు. ముఖ్యంగా వర్షాల సమయంలో కొండపై నుంచి వచ్చే వరద నీరు తొలుత పెద్ద చెరువు, తర్వాత బంధుర సరస్సులోకి చేరేది. ఈ రెండింటికి మధ్య నున్న మదుంను తొలగించడంతో నీరు వచ్చేదారి లేకుండాపోయింది. భక్తులు, స్థానికుల సూచనలతో పెద్ద చెరువులో నీరు ఇందులో చేరేలా అధికారులు కొంత వెసులుబాటు చేసినా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో రెండు తటాకాల్లోనూ ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు భారీగా పేరుకుపోయి జలాలు కలుషితమయ్యాయి. ముఖ్యంగా దేవుడి చెరువు పరిస్థితి చూసి భక్తులు ఆవేదన చెందుతున్నారు. దూర ప్రాంతాలనుంచి వచ్చేవారు ఇక్కడి ప్రాశస్త్యం తెలుసుకుని సరస్సులో నీటిని నెత్తిన చల్లుకునే భాగ్యం లేకపోయిందని వాపోతున్నారు. కనీసం ఇందులో చెత్తాచెదారాలు తొలగించి, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేలా మంత్రి అనిత దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇప్పటికే ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో తగు చర్యలు చేపడితే మేలు జరుగుతుంది.



బంధుర సరస్సులో చెత్తాచెదారాలు



వ్యర్థాలతో కలుషితమైన పెద్ద చెరువు

★ చెరువుల దుస్థితిని ఆలయ ఇనస్పెక్టర్ కూర్మేశ్వరరావు దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా నిర్వహణ నిమిత్తం అధికారులు టెండర్లు పిలిచారని.. త్వరలోనే పనులు మొదలవుతాయని పేర్కొన్నారు.

విజ్ఞాననిధి.. సద్వినియోగం మన విధి



వ్యాసరచన పోటీలో విద్యార్థినులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జీవీఎంసీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. రుధిరరాణి అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'అంతర్జాలం వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై జరిగిన వ్యాసరచన పోటీలో విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ ఇంటర్నెట్ విజ్ఞాన నిధి అని.. దీన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు దాని వినియోగాన్ని తల్లిదండ్రులు పరిశీలించాలన్నారు. పోటీలో గెలుపొందిన పదోతరగతి విద్యార్థిని ప్రథమ, తొమ్మిదో తరగతి చదువుతున్న ఎస్. రిషిత ద్వితీయ, ఎనిమిదో తరగతి చదువుతున్న ఆర్. జోత్స్న తృతీయ బహుమతి దక్కించుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె. రమాదేవి, టి. సంధ్యాకుమారి, సీహెచ్. మహలక్ష్మి, బి. తులసీదేవి, ఇబ్రహీం పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రుధిరరాణి

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు సూచించారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. మార్కుల సాధనలో ఒత్తిడికి గురికావద్దన్నారు. ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. జీవితంలో అనుకున్నది సాధించేంత వరకు విశ్రమించొద్దన్నారు. తేలికైన విధానాలతో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయిని భవాని వెంట ఉన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

పండగలా తెదేపా సభ్యత్వ నమోదు

అచ్యుతాపురం, ఎలమంచిలి, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదును పండగ వాతావరణంలో కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో నిర్వహించాలని ఎలమంచిలి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావు కోరారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, ఎలమంచిలిలో గురువారం ఆయన నాలుగు మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రగడ మాట్లాడుతూ క్రమశిక్షణగల కార్యకర్తలే తెదేపాకు బలమన్నారు. సభ్యులుగా నమోదైన వారికి రూ. అయిదు లక్షల ప్రమాదబీమా, సహజ మరణానికి రూ.10 వేలు మట్టి ఖర్చుల కింద అందిస్తారన్నారు. నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు జరగాలన్నారు. ఎలమంచిలిలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. తెదేపా నాయకులు దూళి రంగనాయకులు, కాండ్రకోట చిరంజీవి, కరణం రవికుమార్, ఆడారి ఆదిమూర్తి, రమణబాబు, కొరారు సాంబ, దిన్‌బాబు, తిమ్మరాజుపేటలో నిర్వహించిన తెదేపా కార్యకర్తల ఆ పార్టీ బీసీసెల్ జిల్లా అధికార ప్రతినిధి కర్రి ఆదిబాబు పాల్గొన్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శులు రాజాన రమేష్‌కుమార్, కర్రి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పార్టీ సభ్యత్వ నమోదులో ముందుండాలని తెదేపా మండలశాఖ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తెలిపారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో గురువారం సాయంత్రం మండల పార్టీ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి బి.కాశీవిశ్వనాథ్, కె. వెంకటేశ్వరరావు, పెదిరెడ్డి శ్రీను, ఎం. వెంకటరమణ, ఎం. దుర్గాప్రసాద్, యు. వెంకటరమణ, గోవింద్, గిరిధర్, సీతారాం, వి. అప్పారావు, మాణిక్యం, జి. రాజు తదితరులు పాల్గొన్నారు.



పెదపాడు పాలకేంద్రం వద్ద పాడిరైతుల ఆందోళన

పాల ధర పెంచాలంటూ 29న ధర్నా

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ పరిధిలో ఆవు పాల సేకరణ ధర తగ్గింపుపై రైతులు పెదపాడు, ఉప్పవరం పాలసంఘాల వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. వీరి ఆందోళనకు ఏపీ రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, బుద్ధ రంగారావు, కాండ్రేగులు రామ సదాశివరావు, బ్రహ్మాజీ మద్దతుగా నిలిచారు. పాడిరైతుల కష్టంతో రూ. కోట్లకు పడగెత్తిన డెయిరీ యాజమాన్యం దీనినే నమ్ముకున్న పేద రైతులను మాత్రం రోడ్డుమీదకు లాగుతోందని మండిపడ్డారు. దీనిపై ప్రభుత్వం విచారణ చేసి సభ్యులకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. యాజమాన్యం దిగివచ్చేలా ఈ నెల 29న విశాఖ డెయిరీ ముందు చేపట్టే ధర్నాకు భారీగా పాడిరైతులు హాజరవ్వాలని కోరారు. పాడిరైతులు అమలకంటి మహాలక్ష్మినాయుడు, చిన్ని సత్యనారాయణ, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వసతుల కొరత.. తప్పని కలత

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

మండలంలోని పలు తీర ప్రాంతాల్లో సరైన వసతులు లేక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వెంకటనగరం, పెంటకోట, గజపతినగరం, పాల్మన్‌పేట, కొర్లయ్యపేట గ్రామాల్లో సౌకర్యాల లేమి వెంటాడుతోంది. మత్స్యకారులు సముద్రంలో వేట చేసుకుని అలసి వస్తే సేదదీరేందుకు విశ్రాంతి భవనాలు, వలలు, మర ఇంజిన్లు భద్రపరుచుకునేందుకు ప్రత్యేక గదులు లేవు. దీంతో ఆరుబయట తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న పాకల్లో వీటిని ఉంచితే విలువైన వస్తువులు చోరుల పాలవుతున్నాయని వీరు ఆందోళన చెందుతున్నారు. చేపలు, రొయ్యలు వంటివి ఎండబెట్టేందుకు సిమెంట్ ప్లాట్‌ఫాంలు, ఉప్పు కుండీలు వంటివి లేవు. వీటిని అధికారులు అందుబాటులోకి తీసుకురాక పోవడంతో ఇసుకలో ఎండబెడుతున్నామని మహిళలు తెలుపుతున్నారు. దీంతో తమ ఉత్పత్తులకు నాణ్యత లోపించి మార్కెట్లలో సరైన ధర రావడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో పెంటకోట తీరంలో ప్రత్యేక సామాజిక విశ్రాంతి భవనం నిర్మాణానికి మత్స్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. దీనికి అటవీశాఖ నుంచి అడ్డంకులు రావడంతో నిర్మాణం స్తంభాల స్థాయిలో నిలిచిపోయింది. ఈ నిర్మాణం పూర్తి చేస్తే పూర్తిస్థాయిలో వసతులు అందుబాటులోకి వస్తాయని మత్స్యకారులు, గ్రామస్థులు వివరిస్తున్నారు. సంబంధిత అధికారులు సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని తీరప్రాంతవాసులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ జయప్రకాశరావును వివరణ కోరగా సంబంధిత మత్స్యశాఖ అధికారులతో చర్చించి వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.



వెంకటనగరం తీరంలో పాకల్లో భద్రపరిచిన వలలు

వసతిగృహాల్లో న్యాయమూర్తి తనిఖీలు

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్లలో ఉన్న బాలిక, బాలుర వసతి గృహాలను నర్సీపట్నం డివిజన్ సీనియర్ సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్ గురువారం తనిఖీ చేశారు. ముందుగా బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. వంటగది, మరుగుదొడ్లు చూశారు. రికార్డులను తనిఖీలు చేశారు. బాల్య వివాహాలు చేయాలని చూస్తూ ఫిర్యాదు చేయాలని బాలికలకు సూచించారు. గదుల్లో ఫ్యాన్లు ఉన్నాయా లేవా, ఇన్వర్టర్ సౌకర్యం ఉందా, లేదా.. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని ఆరాతీశారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోతే చీకట్లోనే ఉంటున్నామని, వర్షం కురిస్తే, పైకప్పు పెచ్చులు కింద పడుతున్నాయని, దోమల బాధ ఎక్కువగా ఉందని పలువురు విద్యార్థినులు చెప్పారు. నెలనెలా ఇవ్వాల్సిన సబ్బులు, నూనె డబ్బులు ఇవ్వటం లేదని తెలిపారు. అనంతరం బీసీ బాలుర వసతి గృహాన్ని కూడా తనిఖీలు చేసి, విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హైకోర్టు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వసతి గృహాలను తనిఖీలు చేస్తున్నామని, ఇక్కడ గమనించిన పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని చెప్పారు.



బాలికలతో మాట్లాడుతున్న జడ్జి షియాజ్‌ఖాన్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: తుమ్మపాల పంచాయతీ మధురానగర్‌లో మురుగు కాలువ నిర్మాణం చేపట్టక రహదారిపై నీరు ప్రవహిస్తోంది. – శ్రీరాములు, మధురానగర్

✓: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– మళ్ల సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

మూడు గంటలు.. ట్రాఫిక్ చిక్కులు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం- అనకాపల్లి రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. హరిపాలెం వద్ద బండ రాళ్లను తీసుకెళ్తున్న లారీ ఇరుసు విరిగిపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు పట్టించుకోకపోవడంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు. గ్రామస్థులే ట్రాఫిక్ సరిచేసే ప్రయత్నం చేశారు. రాత్రి 10 గంటలు దాటినా పరిస్థితి అదుపులోకి రాలేదు. విధులు ముగించుకొని వచ్చిన మహిళా ఉద్యోగులు నానా అవస్థలు పడ్డారు.



హరిపాలెం వద్ద నిలిచిన వాహనాలు

అందుబాటులోకి ఆర్వో ప్లాంట్లు

స్పందనకు వందనం

నక్కపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో వినియోగంలో లేని శుద్ధజల (ఆర్ఓ) ప్లాంట్లను దశలవారీగా అందుబాటులోకి తెస్తున్నట్లు ఎంఈఓ కె.నరేశ్ తెలిపారు. మండలంలోని పలు పాఠశాలల్లో తాగునీటి శుద్ధజల పథకాలు పని చేయకపోవడంపై 'ఈనాడు'లో ఈనెల 18న 'పడకేసిన ప్లాంట్లు.. నిత్యం పాట్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంఈఓలు నరేశ్, వేమగిరి నూకరాజు వీటిని పరిశీలించారు. డి.ఎల్.పురం, జానకయ్యపేటలో పథకాలు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టారు. మిగిలిన వాటిని త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. అంతవరకు బయటినుంచి తెచ్చిన నీటిని కాచి, చల్లార్చి ఇవ్వాలని ఆదేశించారు.

సైకిల్ స్టాండ్ పరులపాలు

పాయకరావుపేట మండలం మంగవరం ప్రభుత్వ పాఠశాలలో సైకిల్ షెడ్ పరులపాలయింది. దాతల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రి భవనానికి అనుకుని కొన్నేళ్ల క్రితం రేకుల షెడ్లు నిర్మించారు. దీనిలో సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు సైకిళ్లను ఉంచుకునేవారు. ఈ షెడ్డులో బయట వ్యక్తులు ద్విచక్రవాహనాలు, కార్లు వంటివి పార్కింగ్ చేస్తున్నారు. దీంతో సైకిళ్లను ఎండలో ఉంచాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

–పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే



నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

అనకాపల్లి పట్టణం, కశింకోట, న్యూస్‌టుడే: విద్యుత్తు నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి భీమునిగుమ్మం, మళ్లవీధి, శాఖవీధి, నాగవంశంవీధి, వేల్పులవీధి, నాయుళ్లవీధి, ఉడ్‌పేట, నర్సింగరావుపేట, చవితిన వీధి, ఫైర్‌స్టేషన్ ఏరియా, కాశీవిశ్వేశ్వరస్వామి కోవెల, దుర్గాలాడ్జివీధిలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదు. కశింకోట మండలం నర్సింగబిల్లి, గొబ్బూరు, చింతలపాలెం, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, పేరంటాలపాలెం, బంగారయ్యపేట, కొత్తపల్లి, బుచ్చయ్యపేట, ఎ.ఎస్.పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, ఏనుగుతుని, సోమవరం, జి.భీమవరం, అడ్డాం, అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తారు.


నక్కపల్లి, ఎస్.రాయవరం: వేంపాడు ఉపకేంద్రం పరిధిలో డొంకాడ, రేబాక, ముకుందరాజుపేట, జి.జగన్నాథపురం, చీడిక, రమణయ్యపేట, దోసలపాడులో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. కొరుప్రోలు సెక్షన్ పరిధిలోని వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాలకు, వ్యవసాయ మోటార్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తారు.

భూ సమస్యలపై ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: గ్రామసభలో వచ్చిన ప్రతి అర్జీని 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని ఎస్.రాయవరం తహసీల్దార్ రమేష్‌బాబు చెప్పారు. రీ సర్వేలో తప్పుల సవరణకు గురువారం చినగుమ్ములూరులో గ్రామసభ నిర్వహించారు. రైతులు భారీగా తరలివచ్చి తమ సమస్యలను విన్నవించారు. రైతులందరి నుంచి సుమారు 130 అర్జీలు వచ్చినట్లు మండల సర్వేయర్ త్రిమూర్తి తెలిపారు.

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి మండలం కృష్ణాపురంలో రైతుల నుంచి అధికారులకు ఏకంగా 367 వినతులు వచ్చాయి. తమకు ఉన్న భూమి కంటే తక్కువగా నమోదైన ఫిర్యాదులు అధికంగా వచ్చాయని తహసీల్దార్ వరహాలు తెలిపారు. జనసేన నాయకులు గొలగాని భాస్కరరావు పాల్గొన్నారు.

కశింకోట, నక్కపల్లి: కశింకోట మండలంలోని సోమవరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 59 దరఖాస్తులు అందాయి. వీటిని పరిశీలించి సమస్యను పరిష్కరించనున్నట్లు రీసర్వే ఉప తహసీల్దారు భాస్కరరావు తెలిపారు. మండల సర్వేయర్ రామారావు, ఆర్.ఐ. పి.రమేష్ పాల్గొన్నారు. నక్కపల్లి మండలంలోని చందనాడలో రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఉప తహసీల్దారు అన్నాజీరావు, ఆర్.ఐ. కన్నబాబు తదితరులు ఇందులో పాల్గొన్నారు. వ్యక్తిగత సమస్యపై ఓ దరఖాస్తు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



వినతులను పరిశీలిస్తున్న ఎస్.రాయవరం తహసీల్దార్

సాగునీటి సంఘాలకు పూర్వవైభవం తెస్తాం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఐదేళ్ల వైకాపా పాలనలో సాగునీటి రంగాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని ఏపీ పట్టణ ప్రణాళిక, ఆర్థిక మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ పేర్కొన్నారు. అనకాపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి కశింకోట మండల కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీలా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సాగునీటి సంఘాలకు పూర్వవైభవం తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నారని చెప్పారు. సాగునీటి పారుదల వ్యవస్థ బలోపేతం కావాలంటే రైతులు భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో 23 సాగునీటి సంఘాలకు త్వరలో ఎన్నికలు జరుగుతాయన్నారు. వీటిని విజయవంతం చేయడానికి కలసికట్టుగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కూటమి నాయకులతో చర్చిస్తున్న పీలా గోవింద

సాగులో సాంకేతికతపై అవగాహన తప్పనిసరి

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: నూతన సాగు విధానాలపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సంచాలకులు శ్రీధర్ పేర్కొన్నారు. ఎలమంచిలి సబ్ డివిజన్ రైతుసేవ కేంద్రం సిబ్బందికి గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఎన్‌పీఎస్ఎస్ (నేషనల్ పెస్ట్ సర్వైలెంట్ సిస్టం) యాప్‌ను అందరూ వినియోగించాలని సూచించారు. కీటక శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్, విజేత, ఏఓ మోహనరావు పాల్గొన్నారు.

పరవాడపాలెంలో పశువుల పాకలకు నిప్పు

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట మండలం పరవాడపాలెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు పాకలకు నిప్పంటించారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన గొంతిన రమణకు చెందిన రెండు గడ్డికుప్పలు, గొంతిన జగ్గారావుకు చెందిన పాడి ఆవు, పరవాడ అప్పలనాయుడుకు చెందిన 50 నాటుకోళ్లు మృతిచెందాయి. సుమారు రూ. 2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొన్నారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

కల్వర్టు నిర్మాణానికి నిధులు

గొలుగొండ, న్యూస్‌టుడే: నర్సీపట్నం - గొలుగొండ మధ్య ఆరిలోవ అటవీ ప్రాంతంలో కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ ఏడాది జూన్ 18న ఈ రహదారి పరిశీలనకు వచ్చిన సభాపతి అయ్యన్నపాత్రుడు కల్వర్టును వదిలేసి రోడ్డు ఎలా నిర్మించారని ఆర్అండ్‌బీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాలతో ప్రతిపాదనలు పంపగా.. రూ.43 లక్షలు మంజూరయ్యాయని స్థానిక తెదేపా నాయకులు వెల్లడించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట ఉప కేంద్రం నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నందన్ చెప్పారు. కొత్తకోట, దిబ్బపాలెం, జె.నాయుడుపాలెం, చీమలపాడు, దొండపూడి, టి.అర్జాపురం, కొట్నాబిల్లి, కన్నంపేట, జెడ్.కొత్తపట్నం, కిత్తంపేట ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

అ వీ ఇ వీ

అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం నుంచి దీక్షా స్వాములను నిత్యాన్నదానం ప్రారంభమైంది. గ్రామానికి చెందిన పైల సన్యాసమ్మ 11 ఏళ్లుగా ఏటా అయ్యప్ప స్వాములకు 41 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఆలయ గోపురం నిర్మాణానికి విరాళాల సేకరణ

మాడుగుల గ్రామీణం: మాడుగులలో దేవీ ఆలయ అభివృద్ధికి దాతలు సహకారం అందించాలని సివిల్ అండ్ ఆర్టీసీ, ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులు కోరారు. ఆలయ గోపురం నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు దాతల చేయూతతో స్టీల్ గిల్స్, గేట్ల ఏర్పాటు, మండపం నిర్మాణం చేసినట్లు పేర్కొన్నారు.

అర్హులంతా ఓటర్లుగా చేరేలా చూడాలి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులందరినీ ఓటర్లుగా చేర్చాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కోరారు. స్థానిక జిల్లా పరిషత్తు ప్రధాన ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ గడిచిన ఆరేళ్లలో మూడేళ్లపాటు ఉన్నత పాఠశాలల్లో పనిచేసిన వారంతా ఓటర్లుగా నమోదు కావచ్చని తెలిపారు. నవంబరు ఆరు వరకు నమోదు ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తను కృషి చేస్తానని తెలిపారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్ సమావేశానికి అధ్యక్షత వహించారు. నాయకులు ఎం.వి.ప్రసాద్, సుగుణ, వరహాలనాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇనాం భూములకు పట్టాలివ్వాలని వినతి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: చౌడువాడ పంచాయతీలో ఇనాం భూములను సాగు చేసే రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక రైతులు తహసీల్దారు భాగ్యవతికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, సర్పంచి ఎరుకునాయుడు, పాల సంఘం అధ్యక్షుడు కొమార వెంకటరమణ, సన్యాసినాయుడు, నాగార్జున తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: అవురువాడ పంచాయతీలో సంపద తయారీ కేంద్రాన్ని ఈవోఆర్డీ కరుణాకరరావు గురువారం పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆధార్ శిబిరాన్ని సందర్శించారు.

సమష్టిగా కోనాం అభివృద్ధి

చీడికాడ, న్యూస్‌టుడే: కోనాం పంచాయతీలోని అన్ని గ్రామాలను సమష్టిగా అభివృద్ధి చేసుకుందామని సర్పంచి ఈశ్వరమ్మ కోరారు. కోనాంలో గురువారం పంచాయతీ గ్రామసభ నిర్వహించారు. పలు అభివృద్ధి పనులపై పాలకవర్గం తీర్మానం చేసింది. మాజీ సర్పంచి అప్పలనాయుడు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సింహాచలం పాల్గొన్నారు.

పాఠశాలలో ఐక్యరాజ్య సమితి దినోత్సవం

మాకవరపాలెం, న్యూస్‌టుడే: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు గురువారం ఐక్యరాజ్య సమితి దినోత్సవం నిర్వహించారు. యూఎన్‌ఓ అక్షర రూపంలో విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు రాము, ఉపాధ్యాయులు సంతోషి, నారాయణరావు, లోవరాజు పాల్గొన్నారు.

నేతవానిపాలెంలో పారిశుద్ధ్యం మెరుగు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలెంలో పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు చర్యలు చేపట్టారు. డీపీవో శిరీషారాణి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన వ్యర్థాలను పడేయకుండా, మలవిసర్జన చేయకుండా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి లోవరాజు చెప్పారు.

ట్రాఫిక్ అస్తవ్యస్తం.. రాకపోకలకు తప్పని ఇక్కట్లు

నర్సీపట్నంలో ట్రాఫిక్ ఇక్కట్లు

నర్సీపట్నంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జఠిలమవుతోంది. సాయంత్రం వేళల్లో పట్టణ రహదారుల్లో ప్రయాణం భయానకంగా ఉంటోంది. కూడళ్లు కిక్కిరిసిపోతున్నాయి. వాహనాల పెరుగుదలకు అనుగుణంగా రహదారులు విస్తరణకు నోచుకోవడం లేదు. పెదబొడ్డేపల్లి నుంచి నర్సీపట్నం వచ్చే వాహనాలు కొత్తవీధి రోడ్డులో మళ్లిస్తే ప్రధాన రహదారిపై కొంత రద్దీ తగ్గుతుంది. స్కూల్ బస్సులు, ట్రాక్టర్లు, వ్యాన్లను ఇటుగా మళ్లించొచ్చు.



నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

ఆర్టీసీ బస్సులను పట్టణ పరిధిలో ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండటం వల్ల వెనకొచ్చే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. నిర్ణీత స్టేజ్‌ల్లోనే ఆపితే ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉంటుంది. ఆరు నెలల కిందట ప్రధాన రహదారిని కొంతమేర వంద అడుగులకు విస్తరించారు. ఫుట్‌పాత్ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో అవి ఆక్రమణలకు గురవుతున్నాయి. ఈ రోడ్డుపైనే కొందరు కార్లు పార్కింగ్ చేస్తున్నారు. కొందరు దుకాణాలను రోడ్డు మీదనే నిర్వహిస్తున్నారు. గతంలో వేసిన జీబ్రా లైన్లు చెరిగిపోయాయి. వీటిని పునరుద్ధరించి జీబ్రా లైన్లకు ప్రజలు అలవాటు పడేలా చైతన్యం చేయాలి.



కొత్తవీధి రోడ్డు

వన్ వే ఎత్తివేత

మేదరవీధి ఇరుకుగా ఉండటంతో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. గతంలో ఐదు రోడ్ల కూడలి నుంచి పాత బస్టాండ్ వైపు వన్‌వే విధానం అమలు చేసేవారు. కొన్నాళ్లుగా దీన్ని వదిలేశారు. ట్రాఫిక్ సమస్యను సీఐ గోవిందరావు వద్ద ప్రస్తావించగా నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

రణగొణ శబ్దాలతో..: కొంతమంది యువకులు ఎక్కువ శబ్దంతో వాహనాలను నడుపుతున్నారు. ట్రాఫిక్ విధుల్లో ఉండే పోలీసులు ఇలాంటి వారిని గుర్తించి అదుపు చేయాలి. విపరీతమైన శబ్దాల కారణంగా రోడ్డుపై వెళ్లే వారంతా ఇబ్బంది పడుతున్నారు. పట్టణ పరిధిలో వాహనాలు ఢీకొట్టడం, వాహన చోదకులు గాయాలపాలవడం నిత్యకృత్యమైంది. గాయాల వంటి కేసులు చాలావరకు పోలీసు స్టేషన్ వరకు రావడం లేదు. సీఎంఆర్ ఏరియా, కృష్ణాబజార్, సరస్వతి జంక్షన్, పెదబొడ్డేపల్లి మదుం తదితర ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

సాయంత్రమైతే..

శ్రీకన్య కూడలి ప్రాంతంలో పలు కళాశాలలు, స్కూళ్లు ఉన్నాయి. సాయంత్రం అయ్యేసరికి విద్యార్థులతో రోడ్లన్నీ రద్దీగా ఉంటున్నాయి. రద్దీని నియంత్రించేందుకు వీలుగా కళాశాల ముగింపు సమయాలను కొద్దిపాటి విరామంతో విడిచిపెడితే రద్దీ తగ్గుతుంది. ప్రధాన రహదారిలో కొన్నిచోట్ల గోతులు పూడ్చాల్సి ఉంది. శ్రీకన్యకూడలి, అబీద్‌కూడలి, కృష్ణాబజారు, ఐదు రోడ్ల కూడలి ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు నియంత్రించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించాలి.

ప్రగతికి వరం.. దారితప్పితే శాపం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ప్రగతి బాటలో పయనించేందుకు అంతర్జాలం వరం లాంటిదని, దీని వినియోగంలో దారితప్పితే శాపంగా మారుతుందని విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. స్థానిక నలంద ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై చేపట్టిన పోటీల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. సామాజిక మాధ్యమానికి బానిసలైతే ఆరోగ్యాలు గుల్లవుతాయని వ్యాసాల్లో పేర్కొన్నారు. ప్రిన్సిపల్ ఎం.ఎన్.నాయుడు పర్యవేక్షణలో డీన్ బి.సురేష్‌కుమార్, ఆంగ్ల ఉపాధ్యాయుడు సత్యనారాయణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన ఆర్.జ్యోత్స్నప్రియ, పి.జాహ్నవి, పి.మౌక్తికకు పాఠశాల ఏవో నేరెళ్ల సీతాచంద్రిక ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏవో సీతాచంద్రిక, ప్రిన్సిపల్ నాయుడు, డీన్ సురేష్‌కుమార్, సత్యనారాయణ

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తఎల్లవరం విద్యార్థులు

గొలుగొండ, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కొత్తఎల్లవరం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు నర్సింగరావు చెప్పారు. జిల్లా స్థాయి పోటీల్లో బంగారి, జానకి, వర్షిత, అనుశ్రీ, రజిత. భవాని, సత్యవేణి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఈ నెల 26 నుంచి 28 వరకు జరగనున్న పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. సర్పంచి రాంబాబు, పాఠశాల కమిటీ ఛైర్మన్ రాజులనాయుడు, హెచ్ఎం మూర్తి, ఉపాధ్యాయులు బాలికలను గురువారం అభినందించారు.



విద్యార్థులతో కొత్తఎల్లవరం పాఠశాల ఉపాధ్యాయులు

కింతలి విద్యార్థులు


మాడుగుల గ్రామీణం: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో కింతలి జడ్పీ పాఠశాల విద్యార్థులు రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీలో అండర్-14 విభాగంలో తాళపురెడ్డి పునీలా, అండర్-17 విభాగంలో కోన యశ్వంత్ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు నరసింగరావు చెప్పారు. విద్యార్థులతోపాటు పీడీ అబ్బాయిదొరను ఉపాధ్యాయులతో కలిసి గురువారం అభినందించారు.



కింతలి జడ్పీ పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు


కలిగొట్ల వంతెన అప్రోచ్ రోడ్డు పనుల్లో కదలిక

కలిగొట్ల వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావడంపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టిసారించారు. ఈ నెల మొదటి వారంలో కలెక్టర్‌తో కలిసి వంతెనను పరిశీలించిన ఆయన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలతో సంబంధిత అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు. – న్యూస్‌టుడే, దేవరాపల్లి



అప్రోచ్ రోడ్డు నిర్మించాల్సిన ప్రదేశం

వంతెన పూర్తయినా అప్రోచ్ రోడ్డు లేక రాకపోకలు సాగించేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను 'ఈనాడు' కథనాల రూపంలో పలుమార్లు వెలుగులోకి తెచ్చింది. గత ప్రభుత్వం సమస్యపై ఏమాత్రం స్పందించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వంద రోజుల్లోనే సమస్య పరిష్కారానికి అడుగులు పడ్డాయి. ఇరువైపులా అప్రోచ్ రోడ్లు నిర్మిస్తే రాకపోకలు సాగించేందుకు మార్గం సుగమం అవుతుంది. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలను నివేదిక రూపంలో తెలియజేయాలని అనకాపల్లి ఆర్డీవో ఎస్.ఆయిషాను కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ఆర్డీవో గురువారం వంతెన పరిశీలనకు వచ్చారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ఎంత భూమి అవసరమవుతుందని ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. సంబంధిత భూముల వివరాలను తహసీల్దారు లక్ష్మీదేవి, మండల సర్వేయరు గోవిందరాజులు, వీఆర్వో బంగారప్పడు ఆర్డీవోకు వివరించారు. సుమారు రెండు ఎకరాలకు పైగా భూమి అవసరమవుతుందని, ఆ భూములకు సంబంధించి నాలుగు కుటుంబాలకు చెందిన పది మంది రైతులు ఉన్నారని అధికారులు వెల్లడించారు. అందుబాటులో ఉన్న రైతులతో ఆర్డీవో మాట్లాడి వారి అభిప్రాయాలను రికార్డు చేశారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి 2.37 ఎకరాల భూమి అవసరమవుతుందని, నిర్వాసిత రైతులకు రూ.44 లక్షల పరిహారంగా చెల్లించాల్సి వస్తుందని 2018 డిసెంబరులో అప్పటి కలెక్టర్ నుంచి ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీకి ప్రతిపాదన వెళ్లింది. ప్రస్తుతం ఉన్న ధరల ప్రకారం పరిహారమిస్తే సమస్య పరిష్కారమవుతుందని అధికారులు చెబుతున్నారు.



అధికారులు, స్థానికులతో వంతెన పరిశీలనకు వస్తున్న ఆర్డీవో ఆయిషా

వసతిగృహంలో సమస్యలపై ఆరా

నర్సీపట్నం, రోలుగుంట, న్యూస్‌టుడే: నర్సీపట్నంలోని ఆనంద నిలయం, బీసీ బాలుర వసతిగృహం, వృద్ధుల ఆశ్రమాలు, రోలుగుంటలో బీసీ బాలుర వసతి గృహాన్ని సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్‌ఖాన్ గురువారం పరిశీలించారు. విద్యార్థులకు వసతులు, మెనూ అమలు తీరుపై ఆరా తీశారు. పరిశుభ్రమైన తాగునీరు అందించాలని సూచించారు. గదులను పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. పెండింగ్ బిల్లులపై రోలుగుంట బీసీ వసతిగృహ సంక్షేమాధికారి హరగోపాల్‌తో మాట్లాడారు. వసతిగృహాల్లో బాగా దెబ్బతిన్న గదులపై హైకోర్టుకు నివేదిక అందజేయనున్నట్లు చెప్పారు.



వార్డెన్‌తో మాట్లాడుతున్న సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్

వసతి గృహానికి ఫ్యాన్ల వితరణ

చోడవరం: పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహానికి వాసవీ క్లబ్ ఉపాధ్యక్షుడు సోమేశ్వరరావు, అంబేడ్కర్ ట్రస్టు సంయుక్తంగా ఐదు ఫ్యాన్లను వితరణగా అందజేశాయి. విద్యార్థులకు పుస్తకాలు, మిఠాయిలు పంచారు. ట్రస్టు వ్యవస్థాపకుడు సన్యాసిరావు, శేషు, వెంకటరమణమూర్తి, సుందరరావు, పైడారావు, వెంకటరావు, అప్పారావు, సంక్షేమాధికారిణి వరలక్ష్మి పాల్గొన్నారు.

పశుగణనకు సహకరించండి

నర్సీపట్నం అర్బన్: పశుగణన 2025 ఫిబ్రవరి వరకు కొనసాగుతుందని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు రాంబాబు తెలిపారు. నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లో పశువైద్యులు పుష్ప, రమేష్, శిరీష పర్యవేక్షిస్తారని వివరించారు. గొర్రెలు, మేకలు, కోళ్లు ఇతర జీవాలు కలిగి ఉన్నవారు ఇళ్లకు వచ్చే గణకులకు వివరాలు అందజేయాలని కోరారు.

మాడుగుల గ్రామీణం: పశుగణన కోసం మాడుగుల నుంచి 11 మందిని, చీడికాడ మండలం నుంచి 9 మందిని నియమించామని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. రెండు మండలాలకు మణి లక్ష్మణ్, అరుణ కిరణ్, గాయత్రిదేవి, రాఘవమ్మ సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తారన్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి1:** విశ్వం, కళ్లు కంపౌండ్ 1995, లవ్ రెడ్డి, వీక్షణం, **ఆడి2:** వెట్టయన్, ఇద్దరు, **ఆడి3:** దేవర, **ఆడి4:** రోబోట్, రివైండ్, జనక.. అయితే గనక, **రాజు:** వెట్టియన్, విశ్వం, **బంగార్రాజు:** దేవర
చోడవరం: **శ్రీసాయిలక్ష్మి:** విశ్వం, **సాయిలక్ష్మి:** వేట్టయన్, **పూర్ణా:** దేవర

రీసర్వే తప్పులపై వినతులు

చోడవరం, న్యూస్‌టుడే: రీసర్వేతో తామంతా ఇబ్బందులు పడ్డామని గౌరీపట్నం రైతులు వాపోయారు. రెవెన్యూ గ్రామసభలో సమస్యల పరిష్కారం కోరుతూ డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణకు 321 వినతులు అందజేశారు. ఉపసర్పంచి కోన శ్రీను, చంద్రరావు, గంగాధర్, గోపి పాల్గొన్నారు.

రావికమతం, న్యూస్‌టుడే: కొమిర సభలో రైతులు 143 మంది డిప్యూటీ తహసీల్దారు అప్పలనాయుడుకు వినతులు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామసభ జరిగింది. సర్పంచి రవికుమార్, ఉప సర్పంచి సత్యారావు, సర్వేయరు సురేష్, వీఆర్వోలు కనకమ్మ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ, న్యూస్‌టుడే: రీ సర్వేతో వచ్చిన అన్ని భూ సమస్యలు గ్రామసభల ద్వారా పరిష్కారం అవుతాయని ఉప తహసీల్దారు చైన్లు పేర్కొన్నారు. తాళ్లచీడికాడలో గురువారం నిర్వహించిన సభలో పాల్గొని రైతుల నుంచి వచ్చిన వినతులు తీసుకున్నారు. లోపాలను పరిశీలించి త్వరతగతిన పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు.

ముక్కు మూసుకున్నా.. కష్టమే!

బూరుగుపాలెం, తాడపాల రహదారికి ఇరువైపులా వ్యర్థాలు గుట్టలుగా పోగుపడుతున్నాయి. వర్షాలకు కుళ్లి భరించలేని దుర్గంధం వెలువడుతోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారంతా ముక్కు మూసుకువెళ్లాల్సి వస్తోంది. ఇక్కడకు 20 అడుగుల దూరంలో బూరుగుపాలెం జడ్పీ పాఠశాల ఉంది. వ్యర్థాల వల్ల ఈగల బెడద ఎక్కువై మధ్యాహ్న భోజనం చేసేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గొలుగొండ మండల కేంద్రంలో పారిశుద్ధ్యం క్షీణించి వినాయక వీధి, మర్రిమాను కాలనీ వాసులకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మాకవరపాలెం, కృష్ణదేవిపేట



తాడపాల రహదారి పక్కన వ్యర్థాలు



కొంగశింగి దారిలో..

చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలి

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: చెరువుల్లో ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కె.పి.అగ్రహారం సర్పంచి గోపిశెట్టి శ్రీనివాసరావు అధికారులను కోరారు. రెవెన్యూ గ్రామసభ గురువారం ఏర్పాటైంది. భూ సంబంధ సమస్యలను రైతులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రీసర్వేలో చోటుచేసుకున్న తప్పిదాలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు లక్ష్మి చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు దేవర అప్పారావు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులే పరిరక్షించుకోవాలి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రకృతి వరప్రసాదాలైన సాగునీటి చెరువులు ఆక్రమణలకు గురవకుండా ఆయకట్టు రైతులు పరిరక్షించుకోవాలని చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు మరుచర్ల కృష్ణమూర్తినాయుడు కోరారు. సమితి సభ్యులతో కలిసి గురువారం నర్సీపట్నం పెద్ద చెరువును పరిశీలించారు. చెరువుల నిర్వహణను పాలకులు గాలికొదిలేయడం శోచనీయమన్నారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు జాగారపు ఈశ్వర ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు సీతారాం పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

గొయ్యి పూడ్చివేత

స్పందనకు వందనం

గొలుగొండ, న్యూస్‌టుడే: లింగంపేట నూకాలమ్మ ముఖద్వారం వద్ద రహదారిపై గొయ్యి ప్రమాదకరంగా మారింది. రాత్రిపూట వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన గత నెల సెప్టెంబరు 17న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన యువకులు శ్రమదానంతో కంకరతో గొయ్యిని పూడ్చేశారు.

చోడవరం, న్యూస్‌టుడే

?: చోడవరం పంచాయతీ శివారు ఫకీరుసాహెబ్‌పేటలో రామాలయం దరి శాలిపేటలో నాలుగు నెలలుగా తాగునీరు వృథాగా పోతోంది.
– శ్రీను, చోడవరం



✓: తాగునీటి విభాగం సిబ్బందిని పంపి నీటి వృథాను అరికడతాం.
– కె.నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే:

?: పీఎస్ పేట కుమ్మరవీధిలో తాగునీటి బోరు పాడై కొన్నాళ్లుగా మూలకు చేరింది. దీన్ని వినియోగంలోకి తీసుకురావాలి.
– అప్పారావు, వెంకటరావు, చోడవరం



✓: బోరును పరిశీలించి మరమ్మతు చేయిస్తాం. – నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి

చీడికాడ, న్యూస్‌టుడే

?: కట్టవాని అగ్రహారం - విజయరామరాజుపేట మార్గంలో బొడ్డేరు వంతెనపై రక్షణ కుందలు దెబ్బతిన్నాయి. రాకపోకలు సాగించే క్రమంలో అప్రమత్తంగా లేకుంటే వాహనచోదకులు వంతెన మీదుగా నదిలో పడిపోయే ప్రమాదముంది.

✓: వంతెనను పరిశీలించి కుందల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.
– ఆర్అండ్‌బీ ఏఈ, చీడికాడ



ఉపాధి హామీ పనుల్లో అక్రమాలపై విచారణ

గొలుగొండ, న్యూస్‌టుడే: పుత్తడిగైరంపేట పంచాయతీలో జాతీయ ఉపాధిహామీ పథకంలో చేసిన పనుల్లో అనేక అవకతవకలు జరిగినట్లు కొందరు యువకులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. పనులు చేయకుండానే చేసినట్లు, దొంగమస్తర్లు వేసి వేలాది రూపాయలు వీఆర్పీ దిగమింగినట్లు ఆరోపించారు. ఎంపీడీఓ మేరీరోజ్ గురువారం క్షేత్ర పరిశీలనకు వెళ్లారు. పనుల్లో పాల్గొన్న కూలీలతో మాట్లాడి వారి చెప్పిన విషయాలు నమోదు చేశారు. ఇక్కడ సేకరించిన వివరాలపై సమగ్ర నివేదిక ఉన్నతాధికారులకు అందిస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఏపీఓ సూర్యమణి, ఇంజినీరింగ్ సలహాదారు రాధిక తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మేరీరోజ్

ఎంపీ రమేశ్ రాక రేపు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పి.భీమవరంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు ఈ నెల 26న ఎంపీ సీఎం రమేశ్ రానున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామ్మూర్తి గురువారం చెప్పారు. ఎంపీ పర్యటనలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, హౌసింగ్ బోర్డు ఛైర్మన్ తాతయ్యబాబు పాల్గొంటారన్నారు.

మండల పరిషత్తు సమావేశం

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అప్పారావు చెప్పారు. ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

అయోడిన్ లోపంతో అనారోగ్యం

చోడవరం, న్యూస్‌టుడే: ఆహారంలో అయోడైజ్డ్ ఉప్పు వాడితే ఆరోగ్యంగా జీవించవచ్చని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ పేర్కొన్నారు. అయోడిన్ లోపం నివారణ దినోత్సవం సందర్భంగా వాసవీ కిరణా మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో గురువారం వ్యాపారులకు అవగాహన సదస్సు ఏర్పాటైంది. సంఘ అధ్యక్షుడు పసుమర్తి వెంకట్, డాక్టర్ రమేష్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్‌కుమార్, రవికుమార్, శ్రీజ, సంఘ ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో అయోడైజ్డ్ ఉప్పు వాడకంపై ర్యాలీ నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అయోడిన్ లోపం వల్ల చాలామందిలో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి బాలన్న, మహిళా పోలీస్ మహలక్ష్మి, ఉపాధ్యాయిని రామలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త రాధాలక్ష్మి పాల్గొన్నారు.



మంగళాపురంలో విద్యార్థుల ర్యాలీ

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్‌ స్క్రీన్‌-1 - (మార్నింగ్‌, మ్యాట్నీ), దేవర (ఫస్ట్‌, సెకెండ్‌ షో) స్క్రీన్‌-2- విశ్వం

నేటి నుంచి పశు గణన

పెందుర్తి, న్యూస్‌టుడే: అఖిల భారత 21వ పశు గణన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు పెందుర్తి మండలంలో పశు గణన నిర్వహించనున్నట్లు పెందుర్తి పశువైద్యాధికారి డాక్టర్‌ జగన్‌మోహన్‌రావు తెలిపారు. పశు వైద్య సిబ్బంది మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి పశుజాతుల సంఖ్యను నమోదు చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో పశువులకు సంబంధించిన వివిధ ప్రభుత్వ పథకాల రూపకల్పనకు పశు గణన ప్రామాణికమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు పశువులకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు.

– న్యూస్‌టుడే, చినముషిడివాడ(పెందుర్తి)

సమస్య: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ ప్రశాంతినగర్‌లో 74బి/1, సత్యానగర్‌లోని 10ఎ/11 స్తంభాలకు ఉన్న వీధి దీపాలు చాలా రోజులుగా వెలగడం లేదు. కాలనీల్లో రాత్రివేళ చీకట్లో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు.
– తులసి, ప్రశాంతినగర్‌, గోగుల జగన్నాథరావు, సత్యానగర్‌

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమాధానం: మీ ప్రాంతాల్లో వెలగని వీధి దీపాలకు త్వరలోనే మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
– శివరామ్‌ ప్రసాద్‌, ఏఈ, 97వ వార్డు

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్‌ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిక్కవానిపాలెం, దళాయిపాలెం, ఊటగెడ్డపాలెం తదితర గ్రామాలకు సరఫరా ఉండదని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సబ్బవరం(పరవాడ), న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అంతకాపల్లి సబ్‌స్టేషన్‌ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఈపీడీసీఎల్‌ ఈఈ రామకృష్ణ గురువారం తెలిపారు. అంతకాపల్లి, రావులమ్మపాలెం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, రాయపుర అగ్రహారం, ఆరిపాక, బంగారమ్మపాలెం, అడ్డూరు, గొట్టివాడ, లగిశెట్టిపాలెం గ్రామాలకు సరఫరా ఉండదని వెల్లడించారు.

దారంతా గుంతలు.. అంతులేని అవస్థలు


ఎన్‌ఏడీ లేఅవుట్‌ వాటర్‌ ట్యాంకు రోడ్డులో గుంతలు

సుజాతనగర్‌(పెందుర్తి), న్యూస్‌టుడే: అభివృద్ధి పనులు కోసం సక్రమంగా ఉన్నవి ధ్వంసం చేసి వాటిని సకాలంలో పునర్నిర్మించకపోతే వచ్చే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. భూగర్భ మురుగు నీటి(యూజీడీ) పైపులైన్ల ఏర్పాటు కోసం రోడ్లను తవ్వి వాటిని సకాలంలో పూడ్చకపోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని లక్ష్మీనరసయ్యమ్మ నగర్‌, ఎన్‌ఏడీ లేఅవుట్‌లోని రోడ్లు దయనీయంగా మారాయి. గుంతలు పడి రాళ్లు తేలి ప్రయాణం నరకంగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యూజీడీ పనులు ముగిసినా..

ఈ కాలనీల్లో భూగర్భ మురుగు నీటి వ్యవస్థ పనులు గతంలో చేపట్టారు. గొట్టాల కోసం రోడ్డు మధ్యలో గోతులు తవ్వారు. పనులు పూర్తయిన తర్వాత కాంక్రీటుతో గోతులుపూడ్చారు. కానీ, రోడ్లకు పూర్తిస్థాయి మరమ్మతు చేపట్టకపోవడంతో ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. యూజీడీ కోసం బాగున్న రోడ్లను తవ్వేశారు. పనులు ముగిసిన తర్వాత మరమ్మతులు మాత్రమే చేసి మమ అనిపించేశారు.

నూతన రహదారులు నిర్మించాలి

యూజీడీ పనుల కారణంగా ధ్వంసమైన రోడ్లును నూతనంగా నిర్మించాలని లక్ష్మీనరసయ్యమ్మనగర్‌, ఎన్‌ఏడీ లేఅవుట్‌ వాసులు కోరుతున్నారు. వర్షం కురిస్తే రోడ్లపై గోతులన్నీ నీటితో నిండిపోయి ద్విచక్ర వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. పలుచోట్ల రోడ్డుపై కంకర తేలి జారి పడిపోయే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.


లక్ష్మీనరసయ్యమ్మ కాలనీలో మలుపు వద్ద ప్రమాదకరంగా మారిన రహదారి


కాలనీలో ఏ రోడ్డు చూసినా ఇదే దుస్థితి..

అఖిల భారత క్రీడల్లో ఎన్టీపీసీ విద్యార్థినుల సత్తా

పరవాడ, న్యూస్‌టుడే: చైల్డ్‌ ఎడ్యుకేషనల్‌ సొసైటీ ఆధ్వర్యంలో దిల్లీలో ఈనెల 15 నుంచి 19 వరకు నిర్వహించిన 15వ అఖిల భారత ఇంటర్‌ యూనిట్‌ స్పోర్ట్స్‌ మీట్‌-2024 పోటీల్లో పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ బాలభారతి పబ్లిక్‌ స్కూల్‌ విద్యార్థినులు సత్తాచాటారు. అథ్లెటిక్‌ బాలికల విభాగంలో ఛాంపియన్‌షిప్‌ సొంతం చేసుకున్నారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బి.సంధ్యారాణి 400, 800 మీటర్ల పరుగులో బంగారు పతకాలు, 1500 మీటర్ల పరుగులో రజతం సాధించింది. సాయిరాగిని, డింపుల్‌ లక్ష్మి, శరణ్యారెడ్డి, బి.సంధ్యారాణి రిలే పరుగులో రజత పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ మేరకు పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలతో పాటు పీడీ షెల్టన్‌ జేమ్స్‌ను ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్‌ సిన్హా అభినందించారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ అధికారులు, పాఠశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.


ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్‌ సిన్హాతో పతకాలు సాధించిన విద్యార్థినులు

పాల సేకరణ ధర పెంచాలని ఆందోళన

పరవాడ, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ యాజమాన్యం పాలసేకరణ ధరను తగ్గించి పాడిరైతుల ఆదాయాలకు గండికొట్టడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. దీనికి నిరసనగా గురువారం పరవాడలోని విశాఖ డెయిరీ పాలసేకరణ కేంద్రం వద్ద రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఇప్పటికే పశువుల దాణా ధర పెరిగిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే పాలసేకరణ ధర తగ్గించి భారం మోపడం అన్యాయమన్నారు. ధరను వెంటనే పెంచకపోతే ఈనెల 29న విశాఖ డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు. పాడిరైతులకు ఇవ్వాల్సిన బోనస్‌లు ఇవ్వకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో కె.రామసూరి అప్పారావు, కృష్ణ, పోతల శంకర్రావు, అప్పలనాయుడు, నాయుడు, నాగేశ్వరరావు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.


పరవాడ డెయిరీ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

వార్డు మారినా పేరు మారలే..!

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డులోని సచివాలయాల భవనాలపై వార్డు పేర్లను మార్చడానికి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతం జీవీఎంసీ 55వ వార్డులో ఉండేది. 4 ఏళ్ల క్రితం వార్డుల పునర్విభజనలో భాగంగా 55వ వార్డును 77వ వార్డుగా మార్చారు. అయితే ఇప్పటికీ వార్డులోని నమ్మిదొడ్డి కూడలి, కె.ఎస్‌.పాలెం, గొల్లపేట, పెదపాలెంలోని నాలుగు సచివాలయ భవనాలపైన 55వ వార్డుగా పేర్లు రాసి ఉన్నాయి. వార్డు పేరు మారి నాలుగేళ్లయినా భవనాలపైన 55వ వార్డు అని రాసి ఉండటంతో వివిధ పనులు నిమిత్తం వచ్చేవారంతా అయోమయానికి గురవుతున్నారు. సచివాలయ భవనాలపై వార్డు పేర్లు మార్చడంలో సచివాలయ సిబ్బందికి ఇంతెంత సమయం పడుతుందో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.



పెదపాలెం సచివాలయం వద్ద 55వ వార్డుగా రాసి ఉన్న దృశ్యం



గొల్లపేట(పరికిలిదొడ్డి) సచివాలయం వద్ద..

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్‌ అంబేడ్కర్‌ పిలుపునిచ్చారు. పరవాడ మండలం కన్నూరులో గురువారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని భూ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వ భూములు, గెడ్డవాగుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పలువురు వినతిపత్రాలు అందజేశారు. సదస్సులో మొత్తం 47 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి కృష్ణవేణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న పరవాడ తహసీల్దార్‌ అంబేడ్కర్‌

సబ్బవరం(పరవాడ) న్యూస్‌టుడే: సబ్బవరం మండలం గాలిభీమవరంలో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్‌ చిన్నికృష్ణ పాల్గొని మాట్లాడారు. రైతులు నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచి గొర్లె రాజేశ్‌, రెవెన్యూ అధికారులు గణేశ్‌, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

పాపయ్యరాజుపాలెం(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం దరి బ్రహ్మర్షి పిరమిడ్‌ ధ్యాన కేంద్రంలో ధ్యానంపై కార్యశాల నిర్వహించారు. స్పిరిచ్యువల్‌ టూబ్లెట్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ పీఎస్‌.గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ధ్యానంతో ఆరోగ్యంపై సాధకులకు అవగాహన కల్పించారు. ప్రాపంచిక, ఆధ్యాత్మిక జీవిత విధానాలను వివరించారు. ఆయా పద్ధతులు పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు.



సదస్సులో పాల్గొన్న సాధకులు, సూచనలిస్తున్న గోపాలకృష్ణ

● నేడు అప్రెంటీస్‌ మేళా

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ పరిధి మంత్రిపాలెం హైటెక్‌ ఐటీఐలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి అప్రెంటీస్‌ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్‌ అప్పిరెడ్డి దుర్గినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌ సిస్టం కంపెనీ యాజమాన్యం ముఖాముఖి నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఫిట్టర్‌ 100, పెయింటర్‌ 40, మెషినిస్టు 30 మందిని ఎంపిక చేస్తారన్నారు. మేళాకు హాజరయ్యేవారంతా బయోడేటాతో పాటు విద్యా అర్హత ధ్రువపత్రాలతో రావాలని కోరారు.

● పెందుర్తి మండల పరిషత్‌ సమావేశం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండల పరిషత్‌ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ మడపాల నాగమణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మండల పరిషత్‌ కార్యాలయంలో జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొనాలని సూచించారు.

● మద్యం గొలుసు దుకాణంపై పోలీసుల దాడి

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని గవర జగ్గయ్యపాలెంలో ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం పోలీసులు దాడి చేశారు. సీఐ కె.వి.సతీశ్‌కుమార్‌ నేతృత్వంలో సిబ్బంది గవర జగ్గయ్యపాలెంలోని ఓ కిల్లీ బడ్డీపై దాడి చేసి 130 మద్యం, బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గత కొన్నాళ్లుగా కె.వెంకటరావు(35) అనే వ్యక్తి కిల్లీ బడ్డీలో గొలుసు దుకాణం నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు తనిఖీలు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఆ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

అక్రమ నిర్మాణాల ఫిర్యాదులపై పట్టించుకోరా..?

జెర్రిపోతులపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం మారి కూటమి అధికారంలోకి వచ్చినా వైకాపా నాయకుల భూకబ్జాలు ఆగడం లేదు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జెర్రిపోతులపాలెం సర్పంచి మడక అప్పలరాజు ఆరోపించారు. గడచిన ఐదేళ్లలో వైకాపా నాయకులు ఇష్టానుసారంగా భూకబ్జాలు, జగనన్న కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేసినట్లు స్థానిక సచివాలయం కార్యదర్శి విచారణలో తేలినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. గ్రామంలోని ప్రధాన రహదారికి పక్కనే వైకాపా నాయకుడు దర్జాగా రెండు అంతస్తుల భవనాన్ని అక్రమంగా నిర్మిస్తున్నాడని బుధవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.


జెర్రిపోతులపాలెంలో అక్రమ నిర్మాణం

రామచంద్రుడి సన్నిధిలో వైభవంగా హవనం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీరామచంద్రుడు ఆవిర్భవించిన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార సమీపంలోని శ్రీసీతారామ స్వామి దేవాలయంలో గురువారం శ్రీరామ షడక్షరీ హవనం సంప్రదాయబద్ధంగా జరిగింది. అప్పన్న ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్‌ నేతృత్వంలో అర్చకులు సీతారాములను ఆలయ ఉత్సవ మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం పూజలు జరిపారు. హోమగుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేసి హవనం నిర్వహించారు. సంక్షేప రామాయణం పారాయణం చేశారు. శ్రీరామ పట్టాభిషేక సర్గ విన్నపం చేశారు. పూర్ణాహుతి నిర్వహించి పుణ్యాహవాచనం జలాలను ఆలయ ప్రదక్షిణ పూర్వకంగా స్వామికి సమర్పించి ప్రోక్షణ చేశారు. భక్తులు పాల్గొని సీతారాములను సేవించారు.


అలంకరణలో సీతారామ లక్ష్మణులు

భర్త వేధింపులు తాళలేక మహిళ మృతి

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ తీవ్ర మనస్తాపానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మూడో పట్టణ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. రామ్‌నగర్‌లో నివాసముంటున్న టంకాల సునీత (32) సబ్బవరం పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శ్రవణ్‌కుమార్‌తో 2018లో పెద్దల సమక్షంలో వివాహమైంది. నాటి నుంచి పుట్టింటికి వెళ్లి డబ్బులు తేవాలని భర్త డిమాండు చేసేవాడు. తరచూ వేధించడంతో గత కొంతకాలంగా ఆమె రామ్‌నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటోంది. అయినా ఫోన్లో లేదా ఇక్కడికి వచ్చి డబ్బులు కావాలని వేధించేవాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై అనారోగ్యానికి పాలైంది. దీంతో ఇటీవల రామ్‌నగర్‌లోని ఓ కార్పొరేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. తన కుమార్తె మృతికి అల్లుడు వేధింపులే కారణమని మృతురాలి తండ్రి కాళేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సి.ఐ రమణయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

రహదారిపై నూనె.. తప్పిన ప్రమాదం

వేపగుంట, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి తీసుకెళ్తున్న నూనె డబ్బా బీఆర్టీఎస్‌ వేపగుంట సిగ్నల్‌ వద్ద కింద పడి అందులోని నూనెంతా రోడ్డుపై ఒలకడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు జారిపడ్డారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్‌ కానిస్టేబుల్‌ శ్రీనివాసరావు వెంటనే స్పందించి ఇసుకను తెప్పించి నూనెపై చల్లించారు. నెమ్మదిగా ప్రయాణించాలని వాహనదారులను సూచించారు. పలువురు వాహనదారులు, స్థానికులు కానిస్టేబుల్‌ను అభినందించారు.


నూనెపై ఇసుక వేసిన కానిస్టేబుల్‌ శ్రీనివాసరావు

రుతుక్రమ సమస్యలపై అవగాహన



సైకాలజిస్టు లావణ్యను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

పెందుర్తి, న్యూస్‌టుడే: యువతులు రుతుక్రమంలో శుభ్రత, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సైకాలజిస్టు నీలం లావణ్య సూచించారు. రుతు పరిశుభ్రత, ఆరోగ్యంపై గురువారం పెందుర్తిలోని ఆదర్శ్‌ డిగ్రీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్‌ ఫ్లోరా, కార్యదర్శి టి.థియోఫిలస్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లావణ్య పాల్గొని విద్యార్థినులకు రుతు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. హార్మోన్ల అసమతుల్యత వల్ల కలిగే మానసిక సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మళ్ల విజయ, అరుణ, గణేశ్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ పీవోలు మంజుల, ఎన్‌.సంధ్యారాణి పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

గాజువాక, పెదగంట్యాడ, కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : గాజువాక, దువ్వాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడి, తప్పించుకుని తిరుగుతున్న నలుగురు నిందితుల్ని గురువారం క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సౌత్‌ సబ్‌ డివిజన్‌ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు వివరాల ప్రకారం... శ్రీహరిపురానికి చెందిన భార్గవనాయుడు గత నెల 30న గాజువాక నుంచి స్కూటీపై ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో మల్కాపురం, శ్రీహరిపురానికి చెందిన పాత నేరస్థులు ఎన్‌.మహేశ్‌నాథ్‌(19), కె. భానుప్రకాశ్‌(24) స్కూటీని అడ్డగించి బలవంతంగా వెనక సీట్లో కూర్చున్నారు. జింక్‌ గేటు పక్క నుంచి మింది దారిలోకి తీసుకెళ్లమని ఒత్తిడి చేశారు. ఆటువైపు వెళ్లిన తర్వాత భార్గవనాయుడుని కిందకు తోసేసి స్కూటీతో పరారయ్యారు. అప్పట్లోనే బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక క్రైం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఎట్టకేలకు నిందితులు మహేశ్‌నాథ్‌, భానుప్రకాశ్‌ను అరెస్టు చేసి, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

★ ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్న అగనంపూడి ప్రాంతానికి చెందిన వెంకటలక్ష్మి (33) ఈనెల 17న స్థానిక బస్‌స్టాపు వద్ద నిరీక్షిస్తున్నారు. ఆ సమయంలో గంగవరానికి చెందిన జి.సూర్యనారాయణ(22), ముత్యాలమ్మపాలెం నివాసి కె. కోదండరావు(26) వెనక నుంచి బైక్‌పై వచ్చి ఆమె చేతిలో బ్యాగ్‌ లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పుడు నిందితులను అరెస్టు చేసి, వెంకటలక్ష్మికి చెందిన చరవాణి, ఇతర సామగ్రితో పాటు, మరో కేసుకు సంబంధించి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితుల్ని రిమాండుకు తరలించారు.

శోభాయమానం స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, న్యూస్‌టుడే: అప్పన్న స్వామికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. దేవేరుల సమేతుడైన గోవింద రాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు.


రహదారులే క్రీడా ప్రాంగణాలు

నాయుడుతోట(వేపగుంట), న్యూస్‌టుడే: యువకులు క్రీడల్లో రాణించి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ప్రసంగాల్లో చెప్పే పాలకులు, అధికారులు వసతులు కల్పించడంలో మాత్రం విఫలమవుతున్నారు. యువకులు ఆటలు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు నిర్మించడంపై మాత్రం దృష్టిసారించడం లేదు. గత్యంతరం లేక రహదారులనే క్రీడా ప్రాంగణాలుగా మలచుకుని వారికి నచ్చిన ఆటలు ఆడుకుంటున్నారు. సుజాతనగర్‌ నుంచి ఆర్‌ఆర్‌వెంకటాపురం వరకు బీఆర్టీఎస్‌ రహదారిపై తెల్లవారుజాము నుంచి ఉదయం 6 గంటలలోపు బాలలు స్కేటింగ్‌ ఆడుతున్నారు. ఆ తర్వాత ఆడుకుందామన్నా వీలులేకపోవడంతో నిరాసతో వెనుదిరుగుతున్నారు. ప్రమాదమని తెలిసినా మరోదారి లేక రహదారి మధ్యలో ఆటలు ఆడుతున్నామని బాలలు చెబుతున్నారు.

ఎక్కువగా ఈ ప్రాంతాల్లో..: నాయుడుతోట, ఆర్‌ఆర్‌ వెంకటాపురం పవర్‌స్టేషన్‌, సుజాతనగర్‌, అప్పన్నపాలెంలో స్కేటింగ్‌ ఆడుతున్న బాలలు ఎక్కువగా ఉన్నారు. వీరంతా రోజూ తర్ఫీదు పొందేందుకు స్థానికంగా ఎటువంటి సదుపాయాలు గానీ, క్రీడా ప్రాంగణాలు గానీ లేకపోవడంతో ఉదయం బీఆర్టీఎస్‌ రహదారిపై ఆడుతున్నారు. వీరితో పాటు వాకర్స్‌, సైక్లింగ్‌ చేసేవారు బీఆర్టీఎస్‌నే ఎంచుకుంటున్నారు. వేపగుంట పరిసర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో కూడా క్రీడా వసతులు అంతంతమాత్రంగానే ఉండటంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో ఆటలు ఆడుకునే పరిస్థితి లేదు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఉన్న పెందుర్తి నియోజకవర్గంలోని యువకులు క్రీడల్లో రాణించడానికి అవసరమైన క్రీడా ప్రాంగణాలు, వసతుల కల్పనకు పాలకులు, అధికారులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


నాయుడుతోట బీఆర్టీఎస్‌ రహదారిలో స్కేటింగ్‌ చేస్తున్న బాలలు

పగటి వెలుగులకు అడ్డుకట్ట పడేదెప్పుడో..!



జీవీఎంసీలో వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో పలుచోట్ల రాత్రుళ్లు దీపాలు వెలగడం లేదు.. మరికొన్ని చోట్ల పగలు, రాత్రి అన్న తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. జీవీఎంసీ 77వ వార్డు పరిధి పిట్టవానిపాలెంలో గత కొద్దిరోజులుగా పట్టపగలే దీపాలు వెలుగుతున్నా పట్టించుకునేవారే కరవయ్యారని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్తును ఆదా చేయాల్సిన అధికారులు వృథా చేయడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పగటి వెలుగులను అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పరవాడ

పొదలమాటున ప్రమాదకర ప్రయాణం..


తానాం - భరణికం రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

పరవాడ, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులకు ఇరువైపులా పెద్దఎత్తున పిచ్చిమొక్కలు పెరిగి వాహనదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. పరవాడ మండలంలోని భరణికం - తానాం, పరవాడ - తానాం, భరణికం - పరవాడ, జాజులవానిపాలెం - పి.భోనంగి - కలపాక, వాడచీపురుపల్లి - వెంకటాపురం, రేఖవానిపాలెం - గొల్లగుంట, పెదముషిడివాడ - విజయరాంపురం గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. పలుచోట్ల చెట్లు కొమ్మలు రహదారిపైకి చొచ్చుకురావడంతో ఎదురుగా వచ్చే వాహనాల నుంచి తప్పించుకోవడానికి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. భారీ వాహనాల ప్రయాణించే సమయంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు బాగా పెరిగిపోవడంతో మలుపులు వద్ద వాహనాలు దగ్గరికి వచ్చేవరకు కానరావడం లేదని ఆందోళన చెందుతున్నారు. రహదారుల్లో సరిగా విద్యుత్తు దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో చీకటి కమ్మేయడంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేయించాలని ఆయా గ్రామాల ప్రజల కోరుతున్నారు.


రేఖవానిపాలెం - గొల్లగుంట రోడ్డులో..